Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 25.08.2017, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 12 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com




# బాక్సుల్లో భవిష్యత్తు





- పోటెత్తిన ఓటరు... ఇవిఎంలో మేటరు
- రికార్డు స్థాయిలో నమోదైన పోలింగ్
- ఇరు పార్టీలలోనూ గెలుపు ధీమా
- సెమీఫైనల్ లాంటి ఎలక్షన్ కావడంతో టెన్షన్



**నెలరోజులుగా ఒకటే ఉత్కంఠ... రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఒకటే టాపిక్... నంద్యాలలో ఎవరు గెలుస్తారు? ఈ టెన్షన్ తీరడానికి ఇంకో నాలుగురోజులు ఆగాల్సిందే! 28వ తేదీ ఉదయం తొమ్మిది, పది గంటలకల్లా ఎవరి భవిష్యత్ ఏంటో తెలిసిపోతుంది. రాష్ట్ర ప్రజలకు ఈ మూడు నాలుగురోజులు ఆ టెన్షన్ తప్పదు.**

అధికార తెలుగుదేశంపార్టీకి ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సెమీఫైనల్స్ మ్యాచ్ లాంటి నంద్యాల ఉపఎన్నికల పర్వంలో ప్రధాన అంకం పూర్తయ్యింది. 23వ తేదీన నంద్యాల అసెంబ్లీ ఉపఎన్నికల తంతు ప్రశాంతంగా ముగిసింది. నంద్యాల ఓటర్లు పోటెత్తినట్లు వచ్చి ఓటేసారు. రికార్డు స్థాయిలో 79.20 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం లక్షా 73వేల 335 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు పోలింగ్ కేంద్రాల ముందు బారులు తీరి ఓట్లేసారు. నంద్యాల పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాలలో కూడా భారీగా పోలింగ్ నమోదైంది. పెరిగిన పోలింగ్ శాతాన్ని చూసి ఇరు పార్టీల నాయకులు గెలుపు తమదంటే తమదని చంకలు గుద్దుకుంటున్నారు. నంద్యాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలు బాగా పనిచేసాయని, తెలుగుదేశం ఓడిపోతే, అభివృద్ధి ఆగిపోతుందని భావించి అందరూ ఓటు హక్కు వినియోగించుకున్నారని, అదీగాక తమ ప్రలోభాలు బాగానే పనిచేసాయని, గెలుపు తమదేనని తెలుగుదేశం నాయకులు బలంగా నమ్ముతున్నారు.

పోలింగ్ శాతం పెరగడంతో గెలుపుపై వైసిపి ధీమాగా వుంది. పోలింగ్ శాతం పెరగడమంటే అది (మిగతా 2వ పేజీలో)



# కమలంకు పరాభవం

## అక్కడ వద్దు... ఇక్కడ ముద్దు

**మీరు జెండాలు పట్టుకుని రావద్దు... మీ పార్టీ స్లోగన్‌లు చేయొద్దు... మీ పార్టీ చిహ్నాల్ని చూపొద్దు... ముస్లిం ఏరియాలలో అసలు తిరగొద్దు... మిత్రపక్షం కాబట్టి మా గెలుపు కోసం కామ్‌గా ప్రచారం చేసుకోండి... నంద్యాల ఉపఎన్నికల్లో మిత్రపక్షం బీజేపీ పట్ల తెలుగుదేశం వైఖరి ఇది.**

(మిగతా 11వ పేజీలో)



రాజకీయ మలుపు

# బెట్టింగ్ ఊబిలో సిట్టింగ్‌లు

- ప్రతిపక్ష ఎమ్మెల్యేలు టార్గెట్
- కేసును దారి మళ్ళించిన ప్రభుత్వం

**నెల్లూరుజిల్లాలో బెట్టింగ్ మాఫియాను అంతం చేసే లక్ష్యంతో ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ మొదలుపెట్టిన ఆపరేషన్ అటు చేసి ఇటు చేసి పొలిటికల్ ట్రాక్ ఎక్కింది.**

అంతర్జాతీయ క్రికెట్ బుకీ కృష్ణసింగ్‌తో సంబంధాలున్నాయంటూ వైకాపాకు చెందిన నెల్లూరు నగర, రూరల్ ఎమ్మెల్యేలు పి.అనిల్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలకు నోటీసులు జారీ చేయడం, 22వ తేదీన జిల్లా పోలీసు కార్యాలయంలో వీరిద్దరిని విచారించడం, 27వ తేదీ మరోసారి (మిగతా 11వ పేజీలో)



# బాక్సుల్లో భవిష్యత్తు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ వ్యతిరేకతకు సంకేతమని, అదీగాక ముస్లింలు, వైశ్యులు వైసిపికే మద్దతుగా నిలిచారని ప్రభుత్వ వ్యతిరేక ఓటు, వై.యస్. సానుభూతి ఓటు, అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి సానుకూల ఓటుతో తమ గెలుపు నల్లేరుపై నడకేనని వైసిపి వర్గాలు భావిస్తున్నాయి.


నంద్యాల ఉపఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. ఎలక్షన్ ముగియడంతో గెలుపోటములపై విశ్లేషణలు, సర్వేలు మొదలయ్యాయి. నంద్యాల ఉపఎన్నిక అధికార తెలుగుదేశం పార్టీతో పాటు ప్రతి పక్ష వైకాపాకు కూడా జీవన్మరణ సమస్యగా మారడం తెలిసిందే! సాధారణంగా ఒక నియోజకవర్గంలో ఒక ఎమ్మెల్యేనో, ఎంపీనో చనిపోతే వారి కుటుంబసభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకునే సాంప్రదాయాన్ని రాష్ట్రం లోని ప్రధాన పార్టీలు పాటిస్తూ వచ్చాయి. అయితే నంద్యాల వద్దకు వచ్చేసరికి చిక్కు ముడి పడింది. 2014లో భూమా నాగిరెడ్డి నంద్యాల నుండి వైసిపి ఎమ్మెల్యేగా గెలిచాడు. తెలుగుదేశంలో చేరాక మరణించాడు. కాబట్టి ఇది మేం గెలిచిన సీటని చెప్పి జగన్ పోటీ పెట్టాడు. చంద్రబాబుకు నాగిరెడ్డి కుటుంబసభ్యులకు సీటిచ్చి నిలబెట్టక తప్పలేదు. చంద్రబాబు గత ఎన్నికల్లో ఓడిపోయిన శిల్పామోహన్‌రెడ్డికే సీటిచ్చివుంటే వైసిపి ఇంత గట్టిగా పోటీనిచ్చి వుండేది కాదు. కాని, భూమా బ్రహ్మానంద రెడ్డికి సీటివ్వడం, శిల్పా మోహన్‌రెడ్డి వైసిపిలో చేరి అభ్యర్థి కావడంతో ఇంతటి ఉత్కంఠ పోటీ నెలకొంది.

ఇంతవరకు దేశంలో ఎవరూ అధికార దుర్వినియోగం చేయనంతగా నంద్యాల ఎన్నికల్లో తెలుగుదేశం అధికార దుర్వినియోగానికి పాల్పడింది. పదిమంది మంత్రులు, పెద్దసంఖ్యలో ఎమ్మెల్యేలు అక్కడ తిష్టవేసారు. వందల కోట్ల పనులు మొదలు పెట్టి ఓటర్లను ప్రలోభపెట్టారు. ట్రాక్టర్లు, కుట్టుమిషన్లు అంటూ తాయిలాలు అందించారు. ఇంత చేసినా కూడా రేపు టిడిపి గెలవలేదంటే... ఆ పార్టీ భవిష్యత్ ప్రమాదం పడ్డట్లే లెఖ్ఖ! ఈ ఎన్నికల్లో వాళ్ళు పోలీసులను బాగానే వాడుకున్నారు. వైసిపి వాళ్ల మీద దాడులు చేయించారు. వారి ఆర్థిక మూలాల మీద దెబ్బకొట్టే ప్రయత్నం కూడా చేశారు. ఇన్ని చేసి కూడా టిడిపి గెలవడం కాదు, భారీ మెజార్టీతో గెలిస్తేనే చంద్రబాబు నాయకత్వంపై పార్టీ కేడర్‌కు నమ్మకముంటుంది. ఇంకోపక్క రేపటి ఎన్నికలలో అధికారం రేసులో నిలవాలంటే వైసిపికి ఈ ఎన్నికల్లో గెలవాల్సిన పరిస్థితి. ఆ సీరియస్‌ను గుర్తించబట్టే జగన్ ఏకధాటిగా నియోజకవర్గంలో పన్నెండురోజుల పాటు ప్రచారం నిర్వహించడమే కాదు, కొన్నిచోట్ల ఇంటింటికీ వెళ్లాడు. జగన్ ప్రచారం నంద్యాల ఓటర్లను బాగానే ప్రభావితం చేసింది.

టిడిపి ఇంత చేసినా నంద్యాలలో వైసిపి గెలిస్తే... ఇక జగన్‌కు తిరుగులేనట్లే! ప్రజలు ఆయన వైపు వున్నట్లే! ఏదేమైనా నంద్యాల ఓటర్ల తీర్పు ఈవిఎంలలోకి చేరింది. ఆ తీర్పులో ఎవరి రాత ఏ విధంగా రాసుందో తెలుసుకోవడానికి 28వ తేదీ దాకా వేచి చూడక తప్పదు.

## డిఎఫ్ఓగా రామ్మోహన్‌రావు

జిల్లా అటవీశాఖ అధికారిగా ఐఎఫ్ఎస్ అధికారి పి.రామ్మోహన్‌రావును నియమిస్తూ ప్రభుత్వం ఈ నెల 22వ తేదీ ఉత్తర్వులు జారీచేసింది. గుంటూరు సోషల్ ఫారెస్ట్ డిఎఫ్ఓగా ఉన్న రామ్మోహన్‌రావు ఆమేరకు బదిలీపై ఇక్కడికి వచ్చి, రెండుమూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరిస్తారని సమాచారం.



## కాలధర్మం

### మాగుంట దశరధరామిరెడ్డి



సౌమ్యుడు, సహృదయుడు, చిన్న చెరుకూరు రైతుబిడ్డ మాగుంట దశరధ రామిరెడ్డి(85) ఈనెల 20వ తేదిన పరమ పదించారు. ఆయన భార్య లక్ష్మీకాంతమ్మ చాలాకాలం క్రితమే దివంగతులయ్యారు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు దయాకరరెడ్డి కొంతకాలం క్రితం కనుమూశారు. దశరధరామిరెడ్డి రెండవ కుమారుడు మాగుంట సోమశేఖరరెడ్డి బెంగుళూరులో నివసిస్తున్నారు. దశరధ రామిరెడ్డి మృతికి సంతాపం ప్రకటిస్తూ.. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది..'లాయర్'.

### కె.గిరిజ



ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ప్రథమ సోదరి కె.గిరిజ(62) ఈ నెల 23వ తేది బుధవారం వేకువన అనారోగ్యంతో కన్నుమూశారు. ఆమె భర్త కుప్పుస్వామి మస్కట్‌లో ఫార్మా కంపెనీలో పని చేస్తున్నారు. వీరికి ఒక కుమార్తె ఉన్నారు. విజయవాడలో వీరు నివాసం ఉండేవారు. అనారోగ్యంతో గత కొంత కాలంగా ఆమె చెన్నైలోని సోదరి ఎస్పీ శైలజ వద్ద ఉంటున్నారు. గిరిజ ఆకస్మిక మృతి వీరి కుటుంబానికి తీరని లోటు. శోకసాగరంలో ఉన్న వారి కుటుంబానికి 'లాయర్' ప్రగాఢ సానుభూతి.

### మెట్టు శివకుమార్




పద్యకళాపరిషత్ అధ్యక్షుడు, విఆర్ కళాశాల రిటైర్డ్ లెక్చురర్ మెట్టు రామచంద్రప్రసాద్ పెద్దకుమారుడు మెట్టు శివకుమార్(49) ఈ నెల 13వ తేదీ అనారోగ్యంతో కనుమూశారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. రామచంద్రప్రసాద్ పౌల్ట్రీ వ్యాపార రంగంలో ఉండగా, శివకుమార్ వ్యాపారంలో ఆయనకు కుడి భుజంగా నిలిచాడు. శివకుమార్ మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.


# నిశ్చయతాంబూలం



కోవూరు శాసనసభ్యులు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి - శ్రీమతి అరుణల కుమారుడు **దినేష్‌రెడ్డి - శ్రీనిత్య** (జస్టిస్ రెడ్డప్పరెడ్డి మనుమరాలు హైకోర్టు న్యాయవాది డి.వి.శివప్రసాద్‌రెడ్డి - శ్రీవిద్యల కుమార్తెల నిశ్చయతాంబూల వేడుక ఇటీవల హైదరాబాద్‌లోని ఎన్ కన్వెన్షన్ సెంటర్ నందు జరిగింది. మాజీ గవర్నర్ కె.రోశయ్య, కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ, రాష్ట్ర మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణ, సినీ హీరో, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డిలతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన పలువురు రాజకీయ నాయకులు, వివిధ రంగాల ప్రముఖులు ఈ వేడుకకు హాజరై కాబోయే జంటను ఆశీర్వదించారు.











## రియల్ కుదేల్...
# రిజిస్ట్రేషన్‌లు ఢమాల్!

వ్యాపారంలో ఓ లాజిక్ ఉంటుంది. ఈరోజు పెద్దపెద్ద కార్పొరేట్ కంపెనీలు ఆ లాజిక్‌ను ఫాలో అయ్యే వేలకోట్ల లాభాలు గడిస్తున్నాయి. ఈరోజు కార్పొరేట్ కంపెనీలైన రిలయన్స్ కాని, బిగ్‌బజార్‌గాని, డి-మార్ట్ గాని చేసేపని ఏంటంటే.. ఒక వస్తువు మీద 20రూపాయల నికర ఆదాయం పొందుతుంటే దానిని పది రూపాయలకు తగ్గించుకోవడం... కస్టమర్‌కే పదిరూపాయలు ఆఫర్ ఇచ్చి ఆకర్షించడం... అప్పుడేమవుతుంది. బయట మార్కెట్‌లో వంద రూపాయలు అమ్మే కిలో నూనె ప్యాకెట్ ఇక్కడ 90 రూపాయలకే వస్తుంది. దీనివల్ల బిగ్‌బజార్‌కు సాలీనా రోజుకు వందమంది కస్టమర్లు వస్తారనుకుందాం, ఈ ఆఫర్ వల్ల వెయ్యిమంది కస్టమర్‌లు పెరుగుతారు. దీనివల్ల ఏమవుతుంది. ఒక వస్తువు మీద ఆదాయం తగ్గించుకున్నా, వస్తువుల అమ్మకం పెరిగి ఆదాయం ఐదింతలవుతుంది. ఈరోజు కార్పొరేట్ కంపెనీలన్నీ ఇదే పంథాను అనుసరిస్తూ చిన్న సన్న వ్యాపారులను ముంచుతున్నాయి. ఇదే లాజిక్ అన్ని వ్యవస్థలకు, ఆఖరుకు ప్రభుత్వ శాఖలకు కూడా వర్తిస్తోంది.

రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగుండి రిజిస్ట్రేషన్ ఛార్జీలు తక్కువగా వున్నప్పుడు రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం మూడు రిజిస్ట్రేషన్‌లు, ఆరు లాభాలు అన్నట్లుగా వుండేది. రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగుండి, రిజిస్ట్రేషన్ ఛార్జీలు తక్కువగా వున్నాయను కుందాం... ఒక ప్లాటు ఒకరి నుండి ఇంకొకరికి అయిదారు చేతులు మారిందనుకుందాం... ఈ చేయి మారినప్పుడల్లా రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందే! అలా రిజిస్ట్రేషన్ జరిగిన ప్రతిసారి కూడా రిజిస్ట్రేషన్ శాఖకు ఆదాయమే! ఒక ఆస్థికి ఎన్ని ఎక్కువసార్లు రిజిస్ట్రేషన్ జరిగితే ప్రభుత్వానికి అంత ఆదాయం.

2004-2009ల మధ్య కాలంలో వై.యస్. ముఖ్యమంత్రిగా వున్నప్పుడు రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా జరిగింది. రిజిస్ట్రేషన్ శాఖకు కూడా రికార్డు స్థాయిలో ఆదాయం వచ్చింది. 2014లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగా పడిపోయింది. అసలు రిజిస్ట్రేషన్‌లు జరగడమే గగనమైపోయింది. దీని మూలంగా రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం కూడా పడిపోయింది. మూలిగేనక్క మీద తాటికాయ పడ్డట్లు ప్రభుత్వ ఆగష్టు 1 నుండి స్థిరాస్థి విలువలను భారీగా పెంచింది. దీని ద్వారా ఆదాయం పెంచుకోవాలనుకుంది. ఇక్కడే అసలుకు మోసం వచ్చింది. స్థిరాస్థి విలువలు పెరిగి రిజిస్ట్రేషన్ ఛార్జీలు తలకు మించిన భారం కావడంతో అరకొర జరుగుతున్న లావాదేవీలు కూడా ఆగిపోయాయి. దీంతో నెల్లూరుజిల్లా పరిధిలోనే రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయానికి భారీ గండిపడింది.



## గూడూరు 'దేశం'లో...
# మూడు స్థంభాలాట





రాష్ట్రంలో 21మంది వైకాపా ఎమ్మెల్యేలు తెలుగుదేశంలో చేరారు. వారిలో నెల్లూరుజిల్లా నుండి ఒక ఎమ్మెల్యే మాత్రమే వున్నాడు. అతనే గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్. మొదటనుండి తెలుగుదేశంలో వుండి, ఆ పార్టీ తరఫునే గూడూరు మున్సిపల్ ఛైర్మెన్‌గా కూడా పనిచేసిన సునీల్ తర్వాత కాలంలో నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అనుచరుడిగా వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరాడు. పార్టీలో చేరినందుకు ప్రసన్నే అతనికి 2014 ఎన్నికల్లో గూడూరు సీటిప్పించాడు. అప్పుడు గూడూరు వైసిపి టిక్కెట్‌కు భలే డిమాండ్ ఉండింది. అయినా పార్టీలోకి మొదటే వచ్చాడని భావించి సునీల్‌కు సీటిచ్చారు. తెలుగుదేశంలో నెలకొన్న వర్గపోరుతో పాటు వైయస్ గాలి ప్రభావంతో సునీల్ గెలిచాడు. రెండేళ్ల తర్వాత తెలుగుదేశం అధిష్టానంతో ఏం ఒప్పందం కుదిరిందో ఏమో వైసిపిని వదిలి ఆ పార్టీలో చేరిపోయాడు. వైసిపిలోనే ఉండుంటే వచ్చే ఎన్నికల్లోనూ గూడూరు సీటు సునీల్‌దే! ఇప్పుడాయన తెలుగుదేశం పార్టీ. వచ్చే ఎన్నికల్లో సునీల్‌కు సీటు గ్యారంటీ లేదు. సునీల్ మీద వ్యతిరేకత వుంది. వైసిపి నుండి గెలిచి టిడిపిలో చేరడం ఇందుకు ఒక కారణం.

ఇక పార్టీలో సీనియర్ నాయకుడిగా మాజీఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్, 2014 ఎన్నికల అభ్యర్థి డాక్టర్ బి.జ్యోత్స్నలతలు కూడా వున్నారు. నియోజకవర్గాల పునర్విభజన లేదు కాబట్టి వచ్చే ఎన్నికల్లోనూ ఇది రిజర్వుడ్ సీటే! కాబట్టి సీటు కోసం వీళ్ల ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ వుండబోతోంది. ఇప్పటికే నియోజకవర్గంలో ఈ ముగ్గురు కూడా ఎవరికి వారే అన్నట్లుగా వుంటున్నారు. ఎన్నికల నాటికి ఇవి తీవ్రం కావడం తప్పితే తగ్గడం అంటూ ఉండదు.






# జడ్పీ సిఇఓగా సుబ్రహ్మణ్యం

నెల్లూరుజిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా సి. హెచ్.సుబ్రహ్మణ్యంను నియమించారు. కడపజిల్లా పంచాయితీ అధికారిగా పనిచేస్తున్న ఆయనను నెల్లూరు జడ్పీ సిఇఓగా బదిలీ చేశారు. గతంలో ఆయన నెల్లూరుజిల్లా పంచాయితీ అధికారిగా పనిచేసి వున్నారు. ఇప్పటివరకు వసుమతి ఇన్‌ఛార్జ్ సిఇఓగా వ్యవహరించారు.

## 'ప్రభా'తం

# రసవత్తరం... తమిళ నాటకం

గత కొద్దిరోజులుగా మలుపులు తిరుగుతూ సంచలనాలు సృష్టిస్తున్న తమిళ'నాటకానికి' తెరపడింది. 'అమ్మ' జయలలిత మరణానంతరం తమిళనాడులో జరుగుతున్న రాజకీయాల్లో మరో ప్రధానఘట్టం..కీలక దశలో విలీనరాజకీయాలకు స్వాగతం పలికింది. ఇప్పటిదాకా తమిళ రాజకీయాల్లో ప్రకంపనాలు సృష్టిస్తున్న అన్నా డిఎంకె పార్టీలోని రెండు వర్గాలు ఏకం కావడంతో ఎట్టకేలకు ఒక అధ్యాయం ముగిసినట్లయింది. అయితే, ఈ తాజా విలీనం వెనుక ఢిల్లీలోని కమలనాథుల కీలకపాత్ర కూడా ఉందనే ప్రచారమూ జోరుగా ఉంది. దీంతో మళ్ళీ తమిళనాట సరికొత్త రాజకీయాలకు తెరతీసినట్లయింది.

ఆరునెలల హైడ్రామా అనంతరం, తమిళనాడులోని అన్నాడిఎంకెలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం వర్గం, ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి వర్గం రెండూ ఒక్కటై చేతులు కలిపాయి. పార్టీలో ఇంతదాకా ఉన్న రెండు వర్గాలు ఏకమవుతున్నట్లు పన్నీర్‌సెల్వం ప్రకటించడంతో ఇరు వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఇద్దరు నేతలూ చేతులు కలుపుకుని సంతోషంగా మాట్లాడుకోవడం తమిళనాట ఒక పర్వదినమే అయ్యింది. తొలుత, శశికళను పార్టీనుంచి బహిష్కరించినట్లు ప్రకటన వెలువడితేనే పార్టీ కార్యాలయానికి వస్తానని పన్నీర్ సెల్వం చివరి నిమిషంలో భీష్మించుకున్నప్పటికీ, విలీన ప్రక్రియ ముగిసిన తర్వాత ఆ విషయం తప్పకుండా పరిశీలిస్తామని పళనిస్వామి రాయబారం పంపగా పన్నీర్‌సెల్వం సమ్మతించడంతో ఆ ఉత్కంఠ కూడా ఉపశమించింది. అధికారం విషయంలో కూడా ఇరు వర్గాలు చర్చించుకుని ఒక కొలిక్కి వచ్చాయి. పార్టీ పగ్గాలు పన్నీర్ సెల్వంకు అప్పగిస్తూ, ప్రభుత్వ బాధ్యతలు పళనిస్వామి నిర్వర్తించాలనే నిర్ణయానికి వచ్చాయి. దీంతోపాటుగా పన్నీర్‌సెల్వంకు ఉప ముఖ్యమంత్రి పదవి, కీలకమైన ఆర్థికశాఖలను కూడా అప్పగించేందుకు ముఖ్యమంత్రి పళనిస్వామి అంగీక రించడంతో అన్ని సమస్యలూ ఒక దారికి వచ్చి నట్లయింది. దీంతో, ఇకపై పన్నీర్‌సెల్వం అన్నా డిఎంకె సమన్వయకర్తగా, పళనిస్వామి ఉపసమన్వయకర్తగా వ్యవహరించనున్నారు. ఇద్దరు నేతలూ ఆ తర్వాత మెరీనాబీచ్‌కు వెళ్ళి ఎంజిఆర్, జయలలిత సమాధుల వద్ద పుష్పాంజలి ఘటించారు. ఆ తర్వాత రాజ్‌భవన్‌లో గవర్నర్ విద్యాసాగర్‌రావు సమక్షంలో పన్నీర్ సెల్వం ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో, ఇద్దరు నేతలు చేతులు కలుపుకుని ఆనందంగా మాట్లాడుకున్నారు. . 'అమ్మ'పార్టీలో చీలికలు ఏర్పడకూడదని, ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకూడదనే కృతనిశ్చయంతో ఇద్దరు నేతలు కలిసిపోతున్నట్లు ప్రకటించారు కూడా. 'మనల్ని ఎవరూ విడదీయలేరని, మనమంతా అమ్మ పిల్లలమని' పన్నీర్‌సెల్వం అంటే, మనమంతా కలిసిపోయినందుకు ఎంజిఆర్, అమ్మ జయలలిత ఎంతో సంతోషిస్తారని పళనిస్వామి అనడంతో పార్టీ కార్యకర్తలంతా సంతోషం వ్యక్తం చేశారు. పన్నీర్‌సెల్వం ఉపముఖ్యమంత్రిగా పదవీప్రమాణం చేయడంతో చీలికవర్గాలు ఒక్కటైపోయాయి. దీంతో ప్రధాని నరేంద్రమోడీ పన్నీర్‌ను అభినందించి, తమిళనాడు అభివృద్ధికి కేంద్రసహకారం ఉంటుందని ఆశీర్వదించారు కూడా. ఇంతవరకూ బాగానే ఉన్నా, ఆ తర్వాత ప్రత్యర్థివర్గాల రాజకీయాలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సిందే.

అసలే రాజకీయాల పుట్ట అయిన తమిళనాడులో, ప్రజల అభిమానాన్ని చూరగొన్న జయలలిత మరణించిన నాటినుంచి జరుగుతున్న నాటకీయ పరిణామాలకు అంతేలేదు. జయలలిత నేస్తం శశికళ జైలుకు వెళ్ళడంతో రాజకీయాలు మరీ శృతిమించాయి. శశికళ వర్గీయుడైన పళనిస్వామి, ఆమె ప్రత్యర్థి అయిన పన్నీర్‌సెల్వం వర్గాలుగా ఏర్పడి రాజకీయాలకు తెరతీయడంతో తమిళ నాడులో రసవత్తర రాజకీయాలు ప్రారంభమయ్యాయి. ఇరువర్గాల మధ్య ఎలాగైనా సయోధ్య కుదిరిస్తే భవిష్యత్తులో తమపార్టీకి ప్రయోజనం ఉంటుంది కనుక, బిజెపి ఈ రాజకీయాల్లో కీలకమైన పాత్రనే పోషించిందని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. విలీనవర్గానికి కేంద్రం ఆశీస్సులున్నాయి కనుక, కేంద్ర మంత్రివర్గంలో ఈ పార్టీకి చెందిన నలుగురికి పదవులు దక్కే అవకాశం కూడా ఉందని భావిస్తున్నారు. ఇదిలావుంటే, పన్నీర్-పళని వర్గాలు ఏకం కావడంపై ఆ పార్టీ బహిష్కృత నాయకుడు, శశికళ మేనల్లుడు టీటీవి దినకరన్ మండిపడుతున్నాడు. తనవర్గంగా ఉన్న కొంతమంది ఎమ్మెల్యేలతో పార్టీ నుంచి బయటకు వచ్చేసే పరిస్థితి నెలకొనడం పట్ల తమిళరాజకీయాల్లో మరోవంక చర్చగా ఉంది. అదే జరిగితే పళని ప్రభుత్వం మైనార్టీలో పడుతుందో ఏమోనంటూ పార్టీవర్గాలు లెక్కలు వేసుకుంటున్నాయి. ఇంకోవైపు డిఎంకె నేత స్టాలిన్ ఈ పరిస్థితుల్లో ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి ఆలోచిస్తున్నారని, ఇదే జరిగితే, ఒకవేళ దినకరన్ వర్గం డిఎంకెతో చేతులు కలిపితే పరిస్థితి ఏమవుతుందోననే చర్చల్లో తమిళ రాజకీయ వర్గాలు తలమునకలై ఉన్నాయి. ఇదిలావుంటే అన్నా డిఎంకెలోని విలీన వర్గాలు తమిళప్రజల నెత్తిన టోపీ పెడుతున్నాయంటూ ప్రముఖ సినీనటుడు కమల్‌హాసన్ చేస్తున్న ట్విట్టర్ విమర్శలు ఆ పార్టీవర్గాలకు మూలిగేనక్కపై తాటికాయ పడ్డ చందంగా ఉన్నాయి.

ఏదేమైనా ఇలాంటి ఉత్కంఠభరిత రాజకీయాలు తమిళనాట కొత్తవేమీ కావు. ఎప్పుడూ ఏదో ఒక రాజకీయ పోరు అక్కడ జరుగుతూనే ఉంటుంది. వ్యక్తుల శక్తిసామర్థ్యాలపై ఆధారపడి పనిచేసే పార్టీలు కాలక్రమంలో ఆయా వ్యక్తులు కనుమరుగయ్యాక చీలికలు పేలికలు కావడం, ఆ తర్వాత జరిగే రాజకీయపరిణామాల్లో మళ్ళీ ఒక్కటైపోతుండడం వంటివన్నీ మామూలే. తమిళనాడులో ఇప్పుడు జరుగుతున్నది ఇదే.

అయితే, ఎప్పటికప్పుడు ఆధిపత్యం కోసం జరిగే ఈ పోరులో చివరికి ఏ పార్టీ నెగ్గుకొస్తుందో, ఆ గెలుపు భవిష్యత్తులో అంతిమంగా ఏపార్టీకి ప్రయోజనం చేకూరుస్తుందో.. వేచి చూడాల్సిందే మరి!



తమిళనాట ప్రకంపనాలు సృష్టిస్తున్న అన్నా డిఎంకెలోని రెండు వర్గాలు ఎట్టకే లకు ఏకమయ్యాయి. ఆరునెలల హైడ్రామా అనంతరం, మాజీ సిఎం ఓ.పన్నీర్‌సెల్వం వర్గం, ముఖ్యమంత్రి ఎడప్పాడి పళని స్వామి వర్గం రెండూ చేతులు కలపడం, 'రెండాకులు' ఒక్కటిగా నిలవడం విశేషం. మరోవైపు, ఈ విలీనరాజకీయంలో బిజెపిది కీలకపాత్ర అనే ప్రచారమూ ఉంది. ఏదేమైనా, ఆ పార్టీలోని చీలికవర్గాలు రెండూ ఒకటి కావడంతో.. తమిళ రాజకీయాల్లో ఒక అధ్యాయం ముగిసినట్లయింది.

# విద్యార్థులకు విద్యతోనే వృద్ధి

**- ప్రముఖ సాహితీవేత్త సాయికృష్ణ యాచేంద్ర**



విద్యతోనే ఉన్నతశిఖరాలు అధిరో హించవచ్చని, ప్రతి విద్యార్థి బాగా చదువు కుని వృద్ధి చెందాలని ప్రముఖ సాహితీ వేత్త, వెంకటగిరి రాజవంశీయుడు డా. విబిఆర్ సాయికృష్ణ యాచేంద్ర అన్నారు. 10వ తరగతి నుంచి వివిధ వృత్తివిద్యా కోర్సులను అభ్యసిస్తూ ఉత్తమ ప్రతిభ చూపుతున్న వెలమ విద్యార్థులకు ఈ నెల 20న నెల్లూరు దర్గామిట్టలో వున్న శ్రీ చాగణం భాస్కరరావు వెలమసంఘం భవ నంలో స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సాయికృష్ణ యాచేంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, ప్రతిభగల విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందిస్తున్న వెలమసంఘం నిర్వాహకులను అభినందించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పెనుబల్లి సీతారామయ్య నాయుడు మాట్లాడుతూ, జిల్లాలో వివిధ తరగతులు, కోర్సులు అభ్యసించే ప్రతిభ గలిగిన 70 మంది విద్యార్థులకు ప్రోత్సా హకంగా అయిదు లక్షల రూపాయల స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్నామన్నారు. వెలమ సంఘం కార్యదర్శి రామయ్య నాయుడు, నాయకులు హనుమంతరావు, శ్రీనివాసులునాయుడు, డాక్టర్ వేణుగోపాల్, సుధాకరరావు, డాక్టర్ ప్రసాదరావు తది తరులు పాల్గొన్నారు.




# విజ్ఞాన యాత్రకు రైతులు

ప్రధానమంత్రి కృషి సంచాయియోజన పథకంలో భాగంగా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఆధ్వర్యంలో తమిళనాడులోని ఉదగ మండలంలో ఐసిఏఆర్ నిర్వహిస్తున్న ఐదురోజుల అంతర్‌రాష్ట్ర విజ్ఞాన యాత్రకు జిల్లా రైతులు సోమవారం బయలుదేరి వెళ్ళారు. నెల్లూరు రమేష్‌రెడ్డినగర్‌లోని 'ఆత్మ' కార్యాలయంలో రైతుల బస్సును ఆత్మ పథక సంచాలకులు ఆనందకుమారి జెండా వూపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనందకుమారి మాట్లాడుతూ విజ్ఞానయాత్రకు 30మంది అభ్యుదయ రైతులు, 10మంది వ్యవసాయాధికారులు వెళుతున్నట్లు తెలిపారు. ఐసిఏఆర్ ఆధ్వర్యంలో జలవనరుల లభ్యత, సంరక్షణ, సమర్థవంతమైన వినియోగం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.




## వారంలోగా ఎలక్షన్స్!

నామినేషన్ తేదీకి ఎలక్షన్ తేదీకి దాదాపు నెలరోజుల వ్యవధి ఉంటున్నందువల్ల ఎన్నికల్లో ప్రలోభాలు పని చేస్తు న్నాయి. అధికార దుర్వినియోగం జరుగుతోంది. కోట్ల రూపా యలు వెదజల్లి ఓట్లు కొంటున్నారు. దౌర్జన్యాలు జరుగు తున్నాయి. అధికారులకూ వృథా ప్రయాస. సొసైటీలకు ఎన్ని కలు నిర్వహించినట్లుగానే రాజకీయ ఎన్నికలను కూడా నామినేషన్ల ప్రక్రియ ముగిసిన వారంరోజుల్లోపే పెట్టేస్తే అక్రమాలు, దౌర్జన్యాలు, డబ్బు, మద్యం పంపిణీ వంటి వాటిని నిరోధించవచ్చు.

**మాటుమడుగు సూర్యప్రకాశ్, తిరుపతి.**

## ఆరంభ శూరత్వం కాకూడదు!


నెల్లూరు నగరంలో పందుల ఏరి వేతకు కమిషనర్ ఢిల్లీరావు ఇచ్చిన 45 రోజుల గడువు ఎప్పుడో ముగిసిపో యింది. అయినా ఇంతవరకు పందుల ఏరివేత మొదలు కాలేదు. పందుల ఏరి వేతకు చట్టపరమైన సమస్యలు అడ్డం వస్తున్నాయంటున్నారు. ఇదేం చోద్యం. పందుల వల్ల రోగాలు ప్రబలి జనం చచ్చి పోతే ఫర్వాలేదా?

**వై.సి.మహేష్, నెల్లూరు.**

## బిజెపీ వాళ్ళకు సిగ్గు లేదా?

నంద్యాల ఉపఎన్నికల్లో మీ పార్టీ జెండాలు కనపడనీయకుండా ప్రచారం చేయండని బీజేపీ నాయకులకు చంద్రబాబు సూచించాడు. ఇది ఆ పార్టీ నాయకత్వానికే సిగ్గుచేటు. చంద్రబాబుకు ఇంకా ఎంతకాలమని అమ్ముడుపోతారు. బీజేపీ జెండా కనపడనీయకుండా చేయడమంటే వారి పార్టీ పతనాన్ని వారే కోరుకోవడం అవుతుంది. బీజేపీ వల్ల చంద్రబాబు లబ్దిపొందాడు. 1999లో వాజ్‌పేయి ఇమేజ్ వల్లే ఆయన గెలవగలిగాడు. 2004లో చంద్రబాబు మీదున్న ప్రజా వ్యతిరేకత వల్ల బీజేపీ దారుణంగా ఓడిపోయింది. 2014 ఎన్నికల్లో నరేంద్ర మోడీ ఇమేజ్ వల్లే ఇక్కడ తెలుగుదేశం అధికారంలోకి రాగలిగింది. బీజేపీ వల్ల రాజకీయ ప్రయోజనం పొందుతున్న చంద్రబాబు ఈరోజు నంద్యాల ఉపఎన్నికల్లో మైనార్టీల ఓట్లు పోతాయని బీజేపీ వాళ్లను జెండాలు తేవద్దనడంపై ఆ పార్టీ వాళ్ళే ఆత్మపరిశీలన చేసుకోవాలి.

**బత్తిన కొండారెడ్డి, ఎస్.ఆర్.పురం.**



కుక్కలు, కోతులు, పందులు, ముదురుదోమలు... ఇవే మున్సిపాల్టీలకు వారసత్వంగా వస్తున్న ఆస్తులు. నేరాలు జరుగుతుంటేనే లాయర్లకు, పోలీసులకు పని వుంటుంది. నేరాలనేవే లేకపోతే అసలు సమాజంలో పోలీసులు, లాయర్‌లు ఎందుకు? అలాగే పందులు, కుక్కలు, కోతులు, దోమలు లేకుంటే మున్సిపాల్టీ వాళ్లకు చేసేందుకు పని ఏమీ వుండదు. అందుకేనేమో వీటిని నిర్మూలించకుండా మున్సిపాల్టీ పాలకవర్గాలు ఈ నాలుగు రకాల జాతులను జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్నాయి.

# రోడ్లపై పందుల రాజ్యం

మన సమాజంలో ఒకే మనిషి విభిన్న కోణాలలో ఆలోచిస్తాడు. ఒక సాధారణ పౌరుడిగా రోడ్డు మీద వెళుతున్నప్పుడు ఒక చెత్తదిబ్బ దగ్గర పందుల సమూహం కనిపించిందనుకోండి... ఛీఛీ... మున్సిపాల్టీవాళ్లకు బుద్ధిలేదు... రోడ్ల మీద పందులు ఇలా ఇష్టారాజ్యంగా తిరుగుతుంటే గాలికి వదిలేస్తారు... జీతాలు, లంచాలపై వున్న శ్రద్ధ, నగర పారిశుద్ధ్యంపై లేదా? అని బాధపడతాడు. అదే వ్యక్తి నగరపాలక సంస్థ కమిషనర్ స్థానంలో వుంటే... నగరంలో పందులు విచ్చలవిడిగా తిరుగుతున్నాయని, వీటిని నగరానికి దూరంగా తరలించాలని ప్రజలు కోరుతారు. అందుకు అధికారిగా ఆయన స్పందించి పందులను ఏరివేయాలనుకుంటాడు. ఈలోపు పందుల యజమానులు కోర్టులో పిటిషన్‌లు వేస్తారు. అప్పుడు ఇదే కమిషనర్... కోర్టు గొడవలు మనకెందుకులే, కోర్టు నుండి క్లియరెన్స్ వచ్చినప్పుడే పందుల పని పట్టొచ్చని ఊరుకుంటాడు. ఇదే వ్యక్తి న్యాయమూర్తిగా ఉన్నాడనుకోండి... పందుల యజమానులు వేసుకున్న పిటిషన్‌ను దయతో పరిశీలిస్తాడు. సమాజంలో ప్రతి మనిషి బ్రతకాలి కదా, వీళ్ల జీవనాధారం దెబ్బ తీయడం కరెక్ట్ కాదు, కాబట్టి పందుల ఏరివేతను నిలిపి వేయండి అంటూ స్టే ఇస్తాడు.

ఇక్కడ ఒకే సమాజంలో ఒకే వ్యక్తి వివిధ స్థాయిలలో వుంటే అతని ఆలోచనా విధానాలు కూడా వేర్వేరుగానే వుంటాయి. కాబట్టే సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఏ స్థాయిలో వున్నవాళ్లైనా సమస్యను ఒకే కోణంలో చూస్తే పరిష్కారం తొందరగా వస్తుంది.

నెల్లూరు నగరంలో పందుల ఏరివేతకు కమిషనర్ 45రోజుల గడువిచ్చారు. ఇచ్చిన గడువు తేదీ దాటిపోయి మళ్ళీ 45రోజులు కూడా కావస్తోంది. నగరంలో పందుల ఏరివేతకు ఇంకా ఎలాంటి చర్యలు మొదలుకాలేదు. నగరంలో జనాభా కంటే వేగంగా పందులు పెరుగుతున్నాయి. ఆ ఏరియా ఈ ఏరియా అని లేకుండా అన్ని ఏరియాల్లోనూ పందులు స్వైర విహారం చేస్తున్నాయి. జనావాసాల మధ్యే పందుల పెంపకందార్లు వుంటున్నారు. రాత్రిపూట హోటళ్లలో మిగిలిపోయిన నిల్వ ఆహారాన్నంతా తీసుకొచ్చి ఇళ్లమధ్యే పందులకు ఆహారంగా వేస్తున్నారు. చుట్టుపక్కల నివాసాల వాళ్లు ఈ కంపును భరించలేకపోతున్నారు. కొందరైతే ఉండలేక ఇళ్ళు ఖాళీ చేసి పోతున్నారు. ఇక్కడ పందులను ఉండనీయవద్దు, పందులకు ఆహారం ఇక్కడ వేయొద్దు అని స్థానికులు అంటే పందుల పెంపకందారులు తిరగబడుతున్నారు. మేం మొదటనుండి ఇక్కడే వుంటున్నాం, ఇక్కడే పందులను పెంచుకుంటున్నాం, మేమువుంటున్న చోటకు మీరే వచ్చి ఇళ్ళు కట్టుకున్నారు. మమ్మల్ని పొమ్మనడానికి మీరెవరంటూ ప్రశ్నిస్తున్నారు. గతంలో పందులను పట్టుకుని లారీలలో ఎక్కిస్తే ఆ లారీలను వీళ్ళు అడ్డగించిన సంఘటనలున్నాయి. ఇప్పుడు ఏకంగా పందులను పట్టకుండా కోర్టుకే పోయారని, అందుకే నగరంలో పందుల ఏరివేత ఆగిపోయిందని తెలుస్తోంది.



పందులను ఇష్టారాజ్యంగా వదిలేస్తే ఏం జరుగుతుందన్నది మొన్న కావలి పట్టణంలో జరిగిన ఒక సంఘటన ద్వారా తేటతెల్లమైంది. బీబీజాన్ అనే వృద్ధ మహిళపై రెండు బలిసిన పందులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. స్థానికులు సకాలంలో ఆ పందులను తరమకపోయి వుంటే అవి ఆమెను చంపేసేవే! కావలి పట్టణంలోనే ఇటీవల కాలంలో పందులు దాడిచేసిన సంఘటనలు చాలానే జరిగాయి. ఇక గతంలో నెల్లూరులోని వెంకటేశ్వరపురం, జనార్ధన్‌రెడ్డి కాలనీలలో కూడా పందుల దాడి వల్ల పలువురు గాయపడ్డ దాఖలాలున్నాయి. చిన్నారులు, వృద్ధులు రోడ్ల మీద తిరుగుతుంటారు. బలిసిన పందులు దాడి చేస్తే వీళ్ళకు ఎదిరించే శక్తి వుండదు. వాటి దాడిలో వీరు ఏమైపోయినా చేయగలిగిందేమీ లేదు. నెల్లూరు నగరంలోనే కాదు, జిల్లాలోని అన్ని పట్టణాలు, చిన్నపల్లెటూర్లలో కూడా పందులు ఇష్టారాజ్యంగా తిరుగుతున్నాయి. పందులను పెంచుకోవద్దని ఎవరూ చెప్పడం లేదు. కాకపోతే జనావాసాలకు దూరంగా పెంచుకుంటే ఎవరికీ ఇబ్బంది వుండదు.

# గుండె చెరువవుతోంది

- ఎండిన రిజర్వాయర్‌లు
- ఎడారులను తలపిస్తున్న చెరువులు
- చిరుజల్లులు తప్ప కురవని వర్షాలు



నెల్లూరుజిల్లాను గత రెండేళ్ల నుండి తీవ్ర కరువు పరిస్థితులు వెంటాడుతున్నాయి. 2015 నవంబర్‌లో కురిసిన భారీ వర్షాలు తప్పితే ఇంతవరకు జిల్లాలో భారీ వర్షాలంటూ లేవు. కనీసం ఎగువ ప్రాంతాల్లో వర్షాలు పడి కృష్ణానది ప్రవహించి శ్రీశైలం రిజర్వాయర్ నిండినా నెల్లూరు జిల్లాను ఆదుకుంటుండేది. మన దరిద్రం అక్కడిదాకా పోయినట్లుంది. ఈసారి శ్రీశైలంలో కూడా నీళ్లు లేవు. 2004లో వై.యస్. సీఎం అయ్యాక పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యం పెంచి సోమశిల రిజర్వాయర్‌ను 74టిఎంసీల పూర్తి సామర్థ్యానికి తీసుకుపోయారు. అప్పటి నుండి కూడా నెల్లూరుజిల్లా రైతాంగాన్ని శ్రీశైలం నీళ్లే ఆదుకుంటూ వచ్చాయి. గత పదేళ్ల కాలంలో చూస్తే ఒక్క ఏడాది తప్పితే పెన్నానదికి సొంత ప్రవాహమొచ్చి సోమశిల డ్యాం నిండిన సందర్భమే లేదు. ప్రతి ఏటా శ్రీశైలం నీళ్లే మనల్ని ఆదుకుంటూ వచ్చాయి. ఈసారి శ్రీశైలం నీళ్లు కూడా లేవు. సోమశిల, కండ్లేరు రిజర్వాయర్‌లలో డెడ్‌స్టోరేజీ కూడా పడిపోయింది. ఇక అక్టోబర్, నవంబర్ నెలల దాకా వర్షాలు పడే అవకాశాలు లేవు. గత సంవత్సరం ఈశాన్య ఋతుపవనాలు కూడా మనకు హ్యాండిచ్చాయి.

నవంబర్, డిసెంబర్ నెలల్లో సక్రమంగా వానలు పడలేదు. ఈ ఏడాది చూస్తే ఫిబ్రవరి నుండి మొదలై ఇప్పటికి కూడా ఎండలు దంచికొడుతున్నాయి. చెరువులు, బావులు పూర్తిగా అడుగంటిపోయాయి. నైరుతి ఋతు పవనాల ప్రభావం చాలా తక్కువగా వుండింది. రెండు మూడు రోజులు తేలికపాటి వర్షాలు కురవడం తప్పించి, నీళ్లు నిల్వ ఉండే స్థాయిలో వానలు పడలేదు. దీంతో పంటలు వేసే దానికి కూడా రైతులకు ధైర్యం చాలడం లేదు. ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటలు వేసిన విస్తీర్ణం బాగా పడిపోయింది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే రబీ సీజన్‌లో సాగు చేయడం కష్టమే అవుతుంది.

# నీళ్ళ పోర్టు లేదు.. గాలి పోర్టు ఉంది



దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జిల్లా పారిశ్రామికాభివృద్ధికి పునాది లాంటి కృష్ణపట్నం పోర్టును మొదలుపెట్టడమే కాదు, ప్రారంభించారు కూడా! చంద్రబాబు అంతకుముందు 9ఏళ్లు సీఎంగా వుంటే పోర్టుకు శంకుస్థాపన చేయడం తప్పించి అంగుళం పని కూడా జరగలేదు. వై.యస్. సీఎం అయ్యాకే నాట్కో కంపెనీకి ఇచ్చిన కృష్ణపట్నం పోర్టు నిర్మాణం కాంట్రాక్ట్‌ను నవయుగ ఇంజనీరింగ్ కంపెనీకి మార్చాడు. పోర్టు పనిని పరుగులు తీయించి 2009కల్లా బెర్త్‌లను పూర్తి చేయించి ఆపరేషన్స్ కూడా మొదలు పెట్టించాడు. వై.యస్. సీఎం కాబట్టే జిల్లాలో కృష్ణపట్నం పోర్టు అంత తొందరగా పూర్తయ్యింది. వై.యస్. హయాంలోనే దగదర్తి మండలం దామవరం వద్ద ఎయిర్‌పోర్టు మంజూరైంది. ఆయన మధ్యలో దుర్మరణం చెందకుండా వుండుంటే ఇదివరకే దామవరం ఎయిర్‌పోర్టు పూర్తయ్యి విమానాలు ఎగురుతుండేవి. ఆయన మరణంతో ఎయిర్‌పోర్టు చాలా వెనక్కిపోయింది. వై.యస్. తర్వాత సీఎంలైన రోశయ్య గాని, కిరణ్‌కుమార్ గాని ఈ పోర్టును గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. 2014లో చంద్రబాబు సీఎం అయ్యాక ఈ పోర్టు పని కొంత ముందుకు కదిలినా మధ్యలో భూవివాదాల వల్ల బ్రేక్ పడింది. మళ్ళీ బీద సోదరుల జోక్యంతో ఎయిర్‌పోర్టు ఇక్కడే ఖరారయ్యింది. భూసేకరణ కూడా దాదాపు పూర్తయినట్లే! అన్నీ సక్రమంగా జరిగితే వచ్చే ఎన్నికలలోపే ఇక్కడ ఎయిర్‌పోర్టును చూడగలం.

ఇక విభజన హామీలలో ఇచ్చిన దుగరాజపట్నం పోర్టుపై మాత్రం కేంద్రం చేతులెత్తేసింది. ఇక్కడ పోర్టు నిర్మాణం వల్ల అంతగా ప్రయోజనం లేదనే రిపోర్ట్‌తో పాటు పర్యావరణ, రక్షణ పరంగా తలెత్తుతున్న అడ్డంకుల వల్ల కూడా ఈ పోర్టు వెనుకకు పోయిందనే చెప్పాలి. మొదటి నుండి కూడా ఈ పోర్టుపై కేంద్రం ఆసక్తి చూపలేదు. ఒకే జిల్లా పరిధిలో రెండు మేజర్ పోర్టుల అవసరం కూడా కనిపించలేదు. కాబట్టి ఈ నీళ్ల పోర్టు మీద ఆశలకు నీళ్లొదులుకోవచ్చు.

## కళాశాలకు వాటర్‌కూలర్

నెల్లూరు నగరంలోని మున్సిపల్ రెసిడెన్షియల్ కళాశాలకు కోటక్ మహీంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో రూ.10వేలు విలువైన వాటర్ కూలర్‌ను అందజేశారు. ఈ నెల 19న నగరపాలక సంస్థ కమిషనర్ ఢిల్లీరావు ఈ కూలర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులు చదువుకునే కళాశాలకు స్వచ్ఛమైన చల్లని తాగునీటి కోసం కూలర్‌ను అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# నరకం చూపిస్తున్నారు



నెల్లూరులో భూగర్భడ్రైనేజీ మాటేమో గాని దీని కోసం తవ్విన రోడ్లు మాత్రం జనానికి నరకం చూపిస్తున్నాయి. భూగర్భ డ్రైనేజీ కోసం ఇష్టారాజ్యంగా సిమెంట్ రోడ్లను తవ్వసి పైపులు వేసిన తర్వాత వాటిని సరిగా పూడ్చకపోవడంతో జనానికి, వాహనదారులకు ఆ రోడ్ల మీద సినిమా కనిపిస్తోంది. ముఖ్యంగా ఇటీవల అడపాదడపా వానలు పడుతున్నాయి. సిమెంట్‌రోడ్లను పైపు లైన్ల కోసం మధ్యలో తవ్వేసి మట్టితో కప్పేసారు. వానలు పడితే ఈ మట్టి కొట్టుకుపోయి మధ్యలో గుంటలు తేలుతున్నాయి. ఇలాంటి సిమెంట్ రోడ్లలో కారు లేదా ఇతర నాలుగుచక్రాల వాహనాలు పోవాలంటే తవ్విన భాగాన్ని సెంటర్ చేసుకుని పోవాలి. ఈ దశలో ఎదురుగా ఏదన్నా వాహనం వచ్చిందంటే పక్కకు జరగడం కూడా కష్టమే! ఏ మాత్రం పక్కకు జరిగినా రోడ్ల మధ్య తవ్విన గోతుల్లో వాహనాలు ఇరుక్కుపోవడం ఖాయం. నగరంలో భూగర్భ డ్రైనేజీ పనులను చేతయ్యి చేతకాని వాళ్లు చేస్తున్నారు. ఈ కాంట్రాక్ట్‌ను ఎల్ అండ్ టి సంస్థ తీసుకుంది. వాళ్లు ఈ పనులన్నింటిని సబ్ కాంట్రాక్టర్లకిచ్చారు. అనుభవం లేని వాళ్ళు కూడా ఈ పనులు చేస్తున్నారు. రోడ్డు తవ్వి పైపులు వేసాక ఆ రోడ్డులో ప్యాచ్‌వర్క్ పూర్తి చేయాలి. కాని, కొందరు కాంట్రాక్టర్లు అలా చేయడం లేదు. తవ్విన చోట మట్టితో పూడ్చేసి పోతున్నారు. వానలు పడ్డప్పుడు ఈ మట్టి కొట్టుకు పోతుంది. గోతులు ఏర్పడుతున్నాయి. నగరంలో ఏ రోడ్డు చూసినా డ్రైనేజీ పనులు జరుగుతుండడం, చేసిన పనులను సక్రమంగా చేయకపోతుండడంతో ప్రజలకు నరకం కనిపిస్తోంది.

# లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే కేసులు

**- అడిషనల్ ఎస్పీ శరత్‌బాబు**



డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే కేసులు తప్పవని అడిషనల్ ఎస్పీ శరత్‌బాబు స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ రామకృష్ణ ఆదేశాల మేరకు ఆయన ఇటీవల నెల్లూరులోని ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో జిల్లాలోని కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా అడిషనల్ ఎస్పీ శరత్‌బాబు మాట్లాడుతూ, కళాశాల బస్సుల్లో తగిన డ్రైవర్ ఉన్నారా లేదా అని ఎప్పటికప్పుడు యాజమాన్యం వారు తనిఖీలు చేసుకోవాలని, అదే విధంగా వాహనం సక్రమంగా ఉందా లేదో పరీక్షించుకోవాలని, ఆ వాహనానికి సంబంధించిన సర్టిఫికెట్‌లు అన్నీ సరిగ్గా ఉన్నాయెూ లేదో చూసుకోవాలని తెలిపారు. 18 ఏళ్ళ లోపు పిల్లలు లైసెన్స్ లేకుండా వాహనం నడపకుండా కళాశాల యాజమాన్యాలు శ్రద్ధ తీసుకోవాలన్నారు. పిల్లల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి ఈ విషయాలపై అవగాహన కల్పించాలని, 18 ఏళ్ళ లోపు వారు ద్విచక్రవాహనాలు, కార్లు వేసుకుని వస్తే వారి తల్లిదండ్రుల మీద కేసులు పెడ్తారని తెలియజేయాలన్నారు. లైసెన్స్ లేనివారికి వాహనం ఇస్తే ఆ వాహనం యజమానిపై కేసు పెట్టాల్సివస్తుందని హెచ్చరించారు. పార్కింగ్ స్థలాల్లోనే వాహనాలు పార్కింగ్ చేయాలన్నారు. కాలేజీ విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కలిగేవిధంగా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సిసిఎస్ డిఎస్పీ బాల సుందరం, ట్రాఫిక్ డిఎస్పీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ఏఆర్‌హెచ్‌సీలకు పదోన్నతి కల్పించండి



జిల్లాలోని ఏఆర్‌హెచ్‌సీల్లో ఎనిమిదిమంది ఆర్ఎస్ఐలుగా పని చేస్తున్నారని, వారి పదోన్నతికి సంబంధించిన ఫైల్ పెండింగ్‌లో ఉందని, పరిశీలించి వారికి పదోన్నతి కల్పించాలని ఇటీవల నెల్లూరుకు విచ్చేసిన డిఐజి కెవివి గోపాల్‌రావుకు జిల్లా పోలీసుసంఘంవారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు ప్రసాద్‌రావు మాట్లాడుతూ, పదోన్నతి పొందిన ఎస్ఐలు, పదవీ విరమణకు దగ్గరగా ఉన్నవారికి సొంత జిల్లాలోనే పనిచేసే విధంగా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అందుకు స్పందించిన డిఐజి ఈ అంశాలను పరిశీలించి పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గంగాధర్, నాయకులు శ్రీనివాసులు, పెంచలప్రసాద్, వరప్రసాద్ పాల్గొన్నారు.

# రాజీవునికి నివాళులు



ఈ నెల 20వ తేదీన మాజీప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ 73వ వర్ధంతిని పురస్కరించుకుని నెల్లూరులోని ఇందిరాభవన్‌లో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సి.వి.శేషారెడ్డి, మాజీ జడ్పీ ఛైర్మెన్ పి.చెంచలబాబుయాదవ్, కాంగ్రెస్ నెల్లూరు నగర అధ్యక్షుడు ఉడతా వెంకట్రావ్‌యాదవ్, టి.బాలసుధాకర్, కేశవనారాయణ, ఫయాజ్, లతారెడ్డి, సుమన్, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మహాలక్ష్మికి

# కుబేర కలశపూజ

లోకకళ్యాణార్థం నిర్వహిస్తున్న ముక్కోటి మహాలక్ష్మీ యాగంలో భాగంగా ఈ నెల 20న నెల్లూరు విఆర్‌సి ఉన్నత పాఠశాల మైదానంలో ఎంతో భక్తిశ్రద్ధలతో శ్రీ మహాలక్ష్మీదేవికి కుబేర కలశ పూజ నిర్వహించారు. వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రధాన అర్చకులు లలితా శివకుమారస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు జరిగాయి. ప్రజలకు ఆయురారోగ్యాలు, ప్రసాదించాలని ఈ పూజలు నిర్వహించారు.

# నెల్లూరు కబుర్లు

## నెల్లూరులోనూ నంద్యాల చర్చే

నంద్యాల అసెంబ్లీ ఎన్నికల మాటేమోగాని ఎక్కడ ఏ నలుగురు గుమికూడినా దీనిపై చర్చే వినిపిస్తోంది. నెల్లూరుజిల్లా ప్రజలు రాజకీయంగా చైతన్యవంతులు. ఏ నలుగురు తాపీగా కలిసినా రాజకీయాల గురించే పిచ్చాపాటిగా మాట్లాడుకుంటుంటారు. దాదాపు నెలరోజుల నుండి నంద్యాలలో ఎవరు గెలుస్తారన్నదే హాట్ టాపిక్‌గా వుంది. బుధవారం నంద్యాల అసెంబ్లీకి ఎన్నికలు ముగిసాక ఈ చర్చలు మరింత తీవ్రమయ్యాయి. తెలుగుదేశం, వైకాపాల గెలుపుపై ఆయా పార్టీల కార్యకర్తలు పందేలకు దిగుతున్నారు.

## సింహపురి ఆసుపత్రికి 'ఐఎస్ఓ' గుర్తింపు



నెల్లూరురూరల్ చింతారెడ్డిపాళెంలోని సింహపురి ఆసుపత్రికి ఐఎస్ఓ గుర్తింపు లభించిందని ఆస్పత్రి ఛైర్మెన్ కాటంరెడ్డి రవీంద్రరెడ్డి తెలిపారు. సోమవారం ఆసుపత్రిలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలోని సౌకర్యాలు, అధునాతన పరికరాలు, నిపుణులైన వైద్యులు, రోగులకు అందిస్తున్న సేవలను ఐఎస్ఓ బృందం ఇటీవల పరిశీలించిందని తెలిపారు. ఆసుపత్రి వైద్యసేవలపై సంతృప్తి చెందిన బృందం ఐఎస్ఓ గుర్తింపు ఇవ్వడం సంతోషదాయకమన్నారు. ఐఎస్ఓ గుర్తింపు రావడానికి కారణమైన వైద్యసిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఇరుకు వంతెనతో ఇక్కట్లు



నెల్లూరు మూలాపేటలోని ఇరుకళల పరమేశ్వరి గుడి జంక్షన్ వద్ద వున్న వంతెన చాలా ఇరుకుగా వుంది. ఇక్కడ నుండి జొన్నవాడ బ్రిడ్జి వరకు నాలుగులైన్ల రోడ్డుంది. జొన్నవాడ నుండి బుచ్చి వరకు కూడా డబుల్‌రోడ్డు బాగుంది. దీంతో నెల్లూరు నుండి బుచ్చి, ఆత్మకూరు, కడప వైపు వెళ్లే వాహనాలు ఇటే ఎక్కువగా పోతున్నాయి. ఇక ఈ రోడ్డు మీద ఇసుక ట్రాక్టర్లు కూడా ఎక్కువే! వాహనాల రద్దీ బాగా పెరిగింది. ఈ రోడ్డుపై పెరిగిన ట్రాఫిక్ మూలంగా ఈ జంక్షన్‌లోని వంతెన వద్ద నిత్యం ట్రాఫిక్‌జామ్ అవుతూనే వుంది. దీనికితోడు ఇక్కడ రోడ్డు మలుపులోనే బస్టాప్ వుండడంతో ఆటోలు, బస్సులు ఇక్కడే ఆపుతుండడం వల్ల ట్రాఫిక్‌జామ్ అవుతోంది. ఈ జంక్షన్ వద్ద ట్రాఫిక్ బాధలు తప్పించాలంటే ఈ వంతెనను వెడల్పు చేయాల్సి వుంది.

## బాలత్రిపుర సుందరికి విశేష పూజలు



ఈ నెల 18వ తేదీన చివరి శ్రావణ శుక్రవారం సందర్భంగా నెల్లూరు స్టోన్ హౌస్‌పేటలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలోని బాలాలయంలో బాలత్రిపుర సుందరి అలంకారంలో వున్న అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. అర్బన్ ఆర్యవైశ్య మహిళా విభాగం కార్యదర్శి చలువాది ఉమారాణి ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. ఈ సందర్భంగా 120మంది మహిళలకు గాజుల బాక్సు, వెండి పుష్పం, తాంబూలం అందజేశారు. ఈ కార్యక్రమంలో సుధారాణి, ముక్కాల కుమారి, వసంత, ఉషారాణి, సురేష్ రాజా, పబ్బిశెట్టి శ్రీనివాసులు, చలువాది శరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈనెల 20న అండర్-16 జిల్లా బాల బాలికల సాఫ్ట్‌బాల్ జట్లను ఎంపికను నిర్వహించారు. బాలుర విభాగంలో సుబ్రహ్మణ్యం, సాయికుమార్, అశోక్, చిన్నారావు, యశ్వంత్, అమీర్, రాజ్‌ప్రకాష్, మల్లి యశ్వంత్, దేవసుందర్, అమీర్, ఉదయ్, శివశంకర్; వెంకటేష్, రుషితేజ, రాజేష్, సాయిరమేష్, ఆదిత్య, నారాయణ ఎంపికైనట్లు అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మలిరెడ్డి కోటారెడ్డి, సిహెచ్ రవికుమార్ తెలిపారు. అదేవిధంగా, బాలికల విభాగంలో శ్రావణి, ప్రసన్న, ప్రియాంక, గోవిందమ్మ, సంగీత, శ్రీలత, హేమలత, అర్జు, నాగేశ్వరి, హబీబున్నిసా, కావ్యమిశ్రా, దీపిక, సుప్రియ, సాయిమౌన్విత ఎంపికైనట్లు వారు పేర్కొన్నారు.

# 'ఫెలోషిప్'కి... డాక్టర్ శ్రీనివాసరాజు



అమెరికన్ కాలేజ్ ఆఫ్ కార్డియాలజీ నెల్లూరు కిమ్స్(బొల్లినేని) హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ చీఫ్ ఇన్వర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సివిఎస్ శ్రీనివాసరాజుని 'ఫెలోషిప్' అవార్డుకు ఎంపిక చేసింది. ఆయన అందించిన విశిష్ట సేవలను గుర్తించి ఫెలో ఆఫ్ ది అమెరికన్ కాలేజీ ఆఫ్ కార్డియాలజీలో సభ్యుడిగా గుర్తించారు. 2018 మార్చి 12న ఓర్లాండో – ఎఫ్ఎల్ పట్టణంలో జరిగే 67వ వార్షిక సైంటిఫిక్ సదస్సులో డాక్టర్ శ్రీనివాసరాజుకి ఫెలోషిప్‌ను ప్రదానం చేయనున్నారు. డాక్టర్ శ్రీనివాసరాజుకు అరుదైన గౌరవం దక్కడంపై కిమ్స్ ఆసుపత్రి యాజమాన్యం తరపున డాక్టర్ బొల్లినేని భాస్కరరావు, హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.గిరినాయుడు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగారావు అభినందించారు. నెల్లూరులో గుండె జబ్బులంటేనే ముందుగా గుర్తొచ్చే పేరు డాక్టర్ శ్రీనివాసరాజు. ఆయన చేయి తగిలితే ఎంత మొండి గుండైనా దారిన పడాల్సిందే! అతిగా స్పందించే గుండెలకు స్పీడ్‌బ్రేకర్, సోమరిపోతు గుండెలకు పరుగులు నేర్పే ట్రైనర్ శ్రీనివాసరాజు. నెల్లూరుజిల్లాలోనే కాక రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో వేలమంది గుండెలకు రక్షకుడిగా వుంటున్న శ్రీనివాసరాజుకు 'లాయర్' అభినందనలు.

# కార్పొరేషన్‌లో అవినీతిని సహించం

## - మేయర్ అజీజ్



నెల్లూరు నగరపాలక సంస్థలోని ఏ విభాగంలోనూ అవినీతిని సహించేది లేదని, అన్ని విభాగాల్లో ప్రత్యేక దర్యాప్తు జరిపించి అవినీతి వ్యవహారాలు జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటామని నగర మేయర్ అబ్దుల్ అజీజ్ అన్నారు. ఈ నెల 20న ఆయనొక ప్రకటన విడుదల చేస్తూ, కార్పొరేషన్ రెవిన్యూ విభాగంలో అవినీతిని ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. ఈ విభాగంలో జరిగిన అవకతవకలపై విచారణ చేసేందుకు ఒక కమిటీని నియమించి, పూర్తిస్థాయిలో విచారణ చేయాల్సిందిగా కార్పొరేషన్ కమిషనర్‌ను ఆదేశించామన్నారు. ఉద్యోగులు ఎవరైనాసరే అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు, కార్పొరేషన్‌లో ఎక్కడా ఎలాంటి అవినీతి, అక్రమాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిధుల దుర్వినియోగంపై నిజానిజాలు వెలికితీసి అవినీతి ఉద్యోగుల భరతం పడతామని మేయర్ హెచ్చరించారు.

# కమ్యూనిటీ హాల్‌కి భూమిపూజ



నెల్లూరు నగరంలోని 37వ డివిజన్ పరిధి క్రాంతినగర్‌లో కమ్యూనిటి హాల్ నిర్మాణానికి 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్‌తో కలిసి నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్ ఈ నెల 19న భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ ఎస్సీ సామాజికవర్గ ప్రజలకు ఒక కమ్యూనిటి హాలు నిర్మించాలని లక్ష్యంగా ఉందన్నారు. నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నగర మేయర్ అబ్దుల్ అజీజ్‌ల సహకారంతో రూ.45లక్షలతో కమ్యూనిటి హాల్ నిర్మాణానికి భూమిపూజ చేయడం చాలా సంతోషకరమన్నారు. మేయర్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ క్రాంతినగర్‌లో నిరుపయోగంగా ఉన్న సామూహిక టాయిలెట్ల నిర్మాణాన్ని పూర్తిగా తొలగించి రూ.45లక్షలతో 250మందికి సరిపడా అన్ని వసతులతో కూడిన కమ్యూనిటి హాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ భవనాన్ని ఆరు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. నెల్లూరు నగరంలో రూ.2కోట్లతో పలు అభివృద్ధి పనులు, రూ.35లక్షలతో రెండు పార్కులను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కార్పొరేటర్లు పరమేశ్వరరెడ్డి, దొడ్డపనేని రాజానాయుడు, టిడిపి జిల్లా నిర్వాహక కార్యదర్శి నన్నేసాహెబ్, నుడా డైరెక్టర్ ఖాజావలి, విజయ డెయిరి ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డాక్టర్ సత్తార్, షంషుద్దీన్, జాకీర్, మౌలానా, సూరిబాబు పాల్గొన్నారు.

# టెక్నాలజీతో నేరాల నియంత్రణ

## - గుంటూరు రేంజ్ డిఐజి కెవివి గోపాలరావు



సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలను బాగా నియంత్రించవచ్చని గుంటూరు రేంజ్ డిఐజి కెవివి గోపాలరావు అన్నారు. డిఐజిగా తొలిసారిగా జిల్లాకు వచ్చిన ఆయన ఆదివారం నెల్లూరు నగరంలోని ఉమేష్‌చంద్ర సమావేశమందిరంలో జిల్లా పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎవరైనా నేరాలు చేయాలంటే భయపడేవిధంగా పోలీసులు వ్యవహరించాలన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులపై ఆరా తీశారు. ఎర్రచందనం, ఇసుక అక్రమరవాణా, క్రికెట్ బెట్టింగ్‌లపై తీసుకుంటున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎవరికీ భయపడకుండా పోలీసులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన సూచించారు. జిల్లాలో శాంతిభద్రతల సమస్య రాకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకుంటూ ఉండాలన్నారు. క్రికెట్ బెట్టింగ్ కేసులో జిల్లా ఎస్పీ రామకృష్ణ చర్యలు అభినందనీయమన్నారు. పోలీసులు బెట్టింగ్ నియంత్రణకు గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. నెల్లూరుతో పాటు, మిగిలిన జిల్లాల్లోనూ క్రికెట్ బెట్టింగ్‌లు అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్యాంబ్లింగ్‌కు, బెట్టింగ్‌లకు ప్రజలు దూరంగా ఉండాలని, లేకుంటే జీవితాలు నాశనమవుతాయని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఎక్కడైనా అలాంటి వ్యవహారాలు జరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చినవారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. జిల్లా ఎస్పీ రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ శరత్‌బాబు, డిఎస్పీలు, సిఐలు పాల్గొన్నారు.

# జిపిఎస్‌తో అక్రమరవాణాకు చెక్!



ఇసుక తరలించే ట్రాక్టర్లకు జిపిఎస్ (గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం) తప్పనిసరిగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు స్పష్టం చేశారు. నెల్లూరు కలెక్టర్ బంగ్లాలో ఈ నెల 18వ తేదీన మైనింగ్, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక ఉచితంగా ఇస్తున్నా చాలా మంది ఇతర ప్రాంతాలకు తరలించే ప్రయత్నాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఉచితంగా ఇసుకను తీసుకెళ్ళి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిసిందన్నారు. వీటిని కట్టడి చేయాలంటే తప్పనిసరిగా ఇసుక తోలే ప్రతి ట్రాక్టర్‌కు జిపిఎస్ ఉండాలన్నారు. ట్రాక్టర్లకు ఈ విధమైన పరికరాలు అమలు చేయాల్సిన బాధ్యత పోలీసు, మైనింగ్ అధికారులపై ఉందన్నారు. ఎవరైనా ఏర్పాటు చేసుకోకపోతే తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సిస్టం 15రోజులలోగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. జిల్లాలో వున్న 28 రీచ్‌లలో ఇసుక తరలింపు ఏ విధంగా ఉందో ఎప్పటికప్పుడు తమకు తెలియాలన్నారు. పోలీసులు ఇసుక ట్రాక్టర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వాటివల్ల ఎటువంటి ప్రమాదాలు రాకుండా చూడాలన్నారు.

## 30న కావలికి డిజిపి

రాష్ట్ర డిజిపి నండూరి సాంబశివరావు ఈ నెల 30న కావలికి రానున్నట్లు సమాచారం. ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నిర్మిస్తున్న కంట్రోల్ కమాండ్ భవనాన్ని ప్రారంభించనున్నట్లు తెలిసింది. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన వంద సిసి కెమెరాలు రికార్డు చేసే వీడియో దృశ్యాలను ప్రతిక్షణం పర్యవేక్షించే అధునాతన టెక్నాలజీని ఈ భవనంలో సమకూర్చనున్నారు. ఈ భవనంలోనే అతిథి గృహాన్ని, ఫంక్షన్‌హాల్‌ను నిర్మించారు. కొద్దిరోజుల్లో నిర్మాణ పనులు పూర్తి కానున్నాయి.

కాగా, కమాండ్ కంట్రోల్ భవన నిర్మాణాన్ని పర్యవేక్షించిన కావలి డిఎస్పీ ఎస్.రాఘవరావు ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈలోగానే డిజిపి చేతుల మీదుగా భవనాన్ని ప్రారంభించనున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమానికి మాజీ ఎస్పీ విశాల్‌గున్నీ హాజరు కానున్నట్లు తెలిసింది.

# నెల్లూరు ఫోటోగ్రాఫర్స్ ఔదార్యం



ప్రపంచ ఫోటోగ్రఫి దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ నెల్లూరుజిల్లా ప్రభుత్వ వైద్యశాల ఎదురుగా వున్న విశ్వభారతి అంధుల పాఠశాలకు నిత్యావసర సామాగ్రిని అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌రాజు, ప్రధాన కార్యదర్శి ఎం.సునీల్‌కుమార్, కోశాధికారి నాగేంద్రకుమార్, పాఠశాల నిర్వాహకురాలు పోరెడ్డి రోశమ్మ, సభ్యులు పాల్గొన్నారు.




### ఫ్రెండ్స్ వాకర్స్‌కు
# మెడికల్ అవగాహన సదస్సు



ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షులు వినుకొండ వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఈ నెల 20వ తేదీ నెల్లూరు నారాయణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో వాకర్స్‌కు మెడికల్ అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో నారాయణ హాస్పిటల్ న్యూరోసర్జరీ విభాగం అధిపతి డా॥ జి.విద్యాసాగర్ మెడ, వెన్నుపూస, నరాల వ్యాధులు, సర్వికల్ స్పాన్డిలోసిస్, లంబార్ స్పాన్డిలోసిస్, తలనొప్పి, వెర్టిగో(తల తిరుగుట), బ్రెయిన్ ట్యూమర్స్, మైగ్రేన్, డయాబెటిక్ న్యూరోపతి, డిస్క్ ప్రాబ్లమ్స్ మూర్ఛవ్యాధి, పక్షవాతం జబ్బుల గురించి సవివరంగా తెలియజేసారు. వాకర్స్ అడిగిన పలు సందేహాలను నివృత్తి చేసారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడు తూనికలు కొలతలు శాఖ విశ్రాంత జిల్లా ఇన్స్‌పెక్టర్ అంబూరు శేషయ్యను ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ తరఫున ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి డి.జయరామానాయుడు , కోశాధికారి పిట్ల రాజారావు, జాయింట్ సెక్రటరీలు ఎన్.సాయి, సుబ్బారావు, కొండూరు సుబ్బారావు, కార్యవర్గ సభ్యులు లక్కాకుల శ్రీనివాసులు, బి.లక్ష్మీనారాయణ, డా॥ సత్యనాథ్, నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. డా॥ విద్యాసాగర్, డా॥ సత్యనాథ్‌లను శాలువ, మెమెంటోలతో సత్కరించారు. నారాయణ హాస్పిటల్ మార్కెటింగ్ హెడ్ సత్యనారాయణను వాకర్స్ అధ్యక్షులు వినుకొండ వెంకటేశ్వర్లు సత్కరించారు.

### ప్రభుత్వాసుపత్రుల్లో...
# మందులకు రూ.500 కోట్లు
### - ఏపి ఎంఎస్ఐడిసి ఛైర్మెన్ లక్ష్మీపతి



లక్ష్మీపతిని అభినందిస్తున్న బీజేపీ నాయకులు

ప్రభుత్వాసుపత్రుల్లో మందుల కొరతను నివారించేందుకు ప్రతి ఏటా రూ.500కోట్లు కేటాయిస్తున్నట్లు ఏపి ఎంఎస్ఐడిసి ఛైర్మెన్ ఆర్.లక్ష్మీపతి పేర్కొన్నారు. సోమవారం నెల్లూరులోని ప్రభుత్వాసుపత్రిని, ప్రభుత్వ వైద్యకళాశాల, సెంట్రల్ డ్రగ్‌స్టోర్స్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలన్న ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయన్నారు. జిజిహెచ్‌లో మౌలిక వసతులు ఎంతో మెరుగుపడ్డాయని, నిత్యం బెడ్‌లపై దుప్పట్లు మార్చడం, పారిశుధ్యాన్ని మెరుగుపరచడం జరుగుతోందన్నారు. నూతనంగా నిర్మించిన భవనంలో 750 పడకలు ఉన్నాయని, అక్కడ అత్యాధునిక వైద్య పరికరాలు అవసరమన్నారు. త్వరలోనే నూతన భవనంలో రోగులకు వైద్యసేవలందించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

అనంతరం మినీబైపాస్‌రోడ్డులోని బీజేపీ కార్యాలయానికి వచ్చి అక్కడి నాయకులతో సంప్రదించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ఆయన్ను సత్కరించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, నగర అధ్యక్షుడు మండ్ల ఈశ్వరయ్య, ఆసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మెన్ చాట్ల నరసింహారావు, సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణరాజు, వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభు పాల్గొన్నారు.

## అవినీతిపై విచారణ చేపట్టాలి

నెల్లూరుజిల్లాలో పెచ్చుమీరిన అవినీతి, కుంభకోణాలు, ఇసుక మాఫియాలపై విచారణ చేపట్టాలని బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి సిఎం చంద్రబాబును సోమవారం మెయిల్ ద్వారా కోరారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో జేసి వెంకటసుబ్బారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పథకాలు పేదలకు చెందకుండా కొందరు పక్కదారి పట్టిస్తున్నారని, నీరు-చెట్టు, ఉపాధిహామీ పథకం అక్రమార్కులకు వరంలా మారాయన్నారు. సమ్మర్ స్టోరేజీ, ఇందిరమ్మ పక్కా ఇళ్ళు, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు, ఎర్రచందనం, సిలికా, ఇసుక మాఫియాలపై విచారణ జరిపించి అవినీతిని అరికట్టాలని డిమాండ్ చేశారు.

# 2019లో వైకాపా గెలుపే లక్ష్యం
### - మేరిగ మురళి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న మేరిగ మురళి

రాబోవు 2019 ఎన్నికల్లో వైకాపా గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని వైకాపా గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీ, వైకాపా సీనియర్ నాయకులు ఎల్లసిరి గోపాలరెడ్డి అన్నారు. సోమవారం ఆర్ అండ్ బి అతిథి గృహంలో వారు మాట్లాడుతూ గూడూరు పట్టణ, మండల స్థాయి బూత్ లెవల్ కమిటీలను, కన్వీనర్లను నియమించామని, వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాలు ప్రతిఒక్కరూ ఇంటింటికి తిరిగి విస్తృత ప్రచారం చేయాలని చెప్పారు. ఈ నెల 26వ తేదీన గూడూరు పట్టణంలో సిఆర్ రెడ్డి కళ్యాణ మండపంలో గూడూరు నియోజకవర్గ స్థాయి బహిరంగ సభను నిర్వహించనున్నామన్నారు. ప్రతి ఒక్కరూ సభను విజయవంతం చేయాలని తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు గడిచినా పేదప్రజలు కష్టాలు పడుతున్నారు తప్ప అభివృద్ధి లేదని ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో వైకాపా నాయకులు మల్లు విజయకుమార్‌రెడ్డి, నాశిన నాగులు, బొమ్మిడి శ్రీనివాసులు, రాధారెడ్డి, రాజారెడ్డి, గిరిబాబు, మగ్దూమ్, దాసరి వెంకటేశ్వర్లు, దాసరి భాస్కర్, బిక్కుబాయి, శీనయ్య, సుబ్బరత్నమ్మ, విద్యాసాగర్, సుబ్బయ్య, శ్రీనివాసులురెడ్డి, షఫీ, నారాయణరెడ్డి, పలువురు ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# లైసెన్సులు తప్పనిసరి
### - ఆర్టీవో చందర్



వాహనాలు నడిపే ప్రతి ఒక్కరికి లైసెన్సులు కలిగి ఉండడం ముఖ్యమని గూడూరు ప్రాంతీయ రవాణాశాఖ అధికారి చందర్ తెలిపారు. గూడూరు రవాణా కార్యాలయంలో మెగా ఎల్ఎల్ఆర్ మేళాను ఈ నెల 20వ తేదీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాన్‌ట్రాన్స్‌పోర్టు లైసెన్సు కలిగిన పలువురు ఆటోరిక్షా డ్రైవర్లకు ట్రాన్స్‌పోర్ట్ ఎల్ఎల్ఆర్‌ను అందించి, లైసెన్సులు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొన్నారని, సుమారు 400 మంది దాకా ఎల్ఎల్ఆర్ మేళాకు వచ్చారని తెలిపారు. ఇక తనిఖీలు చేస్తే లైసె న్సులు లేకుండా ఏ ఒక్క వాహనదారుడు ఉండకూడదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏవో మధాని, ఎంవిఐలు కరుణాకర్, జకీర్, సౌజన్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై ధర్నా చేస్తున్న తిలక్‌నగర్ ప్రజలు

# తిలక్‌నగర్ రోడ్డు బాగుచేయండి

గూడూరు పట్టణానికి కూతవేటు దూరంలో అధ్వాన్న స్థితిలో వున్న తిలక్‌నగర్ రోడ్డును బాగుచేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ అణగారిన వర్గాల సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ స్థానికులు, వివిధ కళాశాలల విద్యార్థులు ధర్నా చేపట్టారు. ప్రభుత్వ, పాలకుల నిర్లక్ష్య వైఖరి నశించాలి, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పంచాయతీరాజ్ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి అంటూ నినదించారు. ధర్నాకు నేతృత్వం వహించిన అణగారిన వర్గాల సమాఖ్య రాష్ట్ర సమన్వయకర్త, స్థానిక పంచాయతీ వార్డు సభ్యుడు ఉడతా శరత్‌యాదవ్ మాట్లాడుతూ గత అనేక సంవత్సరాలుగా తిలక్‌నగర్ మీదుగా వెళ్లే గూడూరు, వెందోడు ప్రధాన రహదారి మరమ్మతులకు నోచుకోక గుంతలమయమై అధ్వాన్నస్థితిలో ఉందన్నారు. చిన్నపాటి వర్షానికే నీటి మడుగును తలపించే విధంగా రాకపోకలకు అసౌకర్యంగా మారుతోందన్నారు. గూడూరు నుండి 16 గ్రామాలకు చెందిన వేలాదిమంది ప్రజలు, వందలాదిమంది వాహనచోదకులు, ముఖ్యంగా కాలేజీ, పాఠశాల వాహనాలు ప్రయాణం చేయడం జరుగుతుందన్నారు. తక్షణమే ఎమ్మెల్యే, ఎంపీలు స్పందించి ఈ రోడ్డును బాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.



ఈ నెల 20వ తేదీ గూడూరు డిఎస్పీ కార్యాలయంలో క్రికెట్ బుకీలను అరెస్ట్ చేసి మీడియా ముందు హాజరు పరచిన గూడూరు ఇన్‌ఛార్జి డిఎస్పీ రాఘవరెడ్డి, ప్రక్కన రూరల్ సిఐ, టౌన్ సిఐ, ఎస్సైలు.

### మిట్టాత్మకూరుకు
## బస్సులు లేక అవస్థలు

గూడూరు నుండి విందూరు మీదుగా మిట్టాత్మకూరుకు వెళ్లే బస్సును ఆర్టీసీ వారు నిలుపు చేయడంతో ప్రజలు, విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆటోలకు డబ్బులు విపరీతంగా వసూలు చేస్తున్నారు. విందూరులో హైస్కూల్‌కు, మిట్టాత్మకూరు, పగడాలపల్లి, ఈదలపల్లి తదితర ఊర్ల నుండి పేదవిద్యార్థులు ప్రతిరోజూ ఆటోలకు డబ్బులు చెల్లించలేకపోతున్నారు. అంతేగాక ఈ మార్గంలో పనిచేసే మహిళా ఉపాధ్యాయినులు కూడా ప్రమాదకర ఆటోలలో ప్రయాణం చేస్తున్నారు. గూడూరు ఆర్టీసీ డిపో మేనేజర్ సహృదయంతో బస్సును పునరుద్ధరించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

శ్రీను గల్పిక

# చెంపదెబ్బల బాబాకు భలే క్రేజ్

ఉండవల్లిలోని హైటెక్‌రత్న, నవ్యాంధ్ర సిఎం చంద్రబాబు నివాసం. తెల్లారుజామున 4గంటలయ్యింది. చంద్రబాబు అమరావతి కోసం సింగపూర్ రాజధాని కల కంటూ మంచి గాఢనిద్రలో వున్నాడు. అప్పుడు మోగింది ఆయన సెల్‌ఫోన్... "తెలుగు వీర లేవరా... నంద్యాల వైపు సాగరా" అనే రింగ్‌టోన్‌తో! ఆ దెబ్బకు చంద్రబాబు ఉలిక్కిపడి లేచాడు. ఆయన అమరావతి సింగపూర్ రాజధాని కల చెదిరిపోయింది. ఈ జామున ఎవరికి ఏ ఆపదవచ్చిందబ్బా అనుకుంటూ ఆయన ఫోన్ ఎత్తాడు. అవతల నంద్యాల నుండి కె.ఇ.ప్రభాకర్... సార్, నంద్యాలలో మన నాయకులంతా అలిగి ప్రచారానికి దూరంగా వున్నారు, మీరు జోక్యం చేసుకోవాలని చెప్పాడు. ఎవరెవరు దూరంగా వున్నారని చంద్రబాబు అడిగాడు. నంద్యాల ఓ.ఎస్‌డి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎంపీ టి.జి.వెంకటేష్, ఆకే అమర్‌నాథ్‌రెడ్డి, దేవగుడి ఆదినారాయణ రెడ్డి, అఖిలప్రియ, ఫరూఖ్, ఎస్పీవై రెడ్డి, ఎస్వీ సుబ్బారెడ్డి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు... పార్టీ కార్యక్రమాలనే పట్టించుకోకుండా దూరంగా వుంటున్నారు. ఇంకో రెండు రోజుల్లో ఎలక్షన్ వుంది. ఇప్పుడెలా అని కె.ఇ.ప్రభాకర్ అడిగాడు. అసలు వాళ్లు అంతలా ఎందుకు అలిగారని చంద్రబాబు అడిగాడు. మన లెజెండ్ బాలకృష్ణ వచ్చాడు కదండి అని కె.ఇ.ప్రభాకర్ అనగానే... చంద్రబాబు గుండె గతుక్కుమంది... వెంటనే ఆయన వీళ్లందర్నీ బాలయ్య కొట్టాడా? అని ఆదుర్దాగా అడిగాడు. అందుకు కె.ఇ... అంత అదృష్టం తమకు లేదనే వాళ్లంతా అలిగివున్నారు. బాలయ్య చేత చెంపదెబ్బలు తినే అదృష్టం కూడా మాకు లేదా? పార్టీకి ఇన్నేళ్లు చేసిన చాకిరికి మాకు ఇచ్చిన గుర్తింపు ఇదేనా? బాలయ్య చెంపదెబ్బలకు కూడా మేము అర్హులం కామా? అని వాళ్లంతా అలిగివున్నారు. బాలయ్య వచ్చి తలా ఒక చెంపదెబ్బ కొడితేగాని వాళ్లు అలకవీడి పనిలో పడేటట్లు లేరు అని చెప్పాడు. ఆ మాటకు చంద్రబాబు తల వెయ్యి కిలోమీటర్ల వేగంతో తిరిగింది. ఎవరన్నా చెంప మీద కొడితే అలుగుతారు, వీళ్లేంటి కొట్టలేదని అలగడం అని మనసులో అనుకుంటూ... అసలేం జరిగింది. బాలయ్య చేత చెంపదెబ్బలు కొట్టించుకోవడానికి వీళ్లెందుకు ఉత్సాహం చూపుతున్నారని చంద్రబాబు అడిగాడు. అవతల నుండి కె.ఇ... ఓహో మీకింకా విషయం తెలీదా... అట్లాగైతే ఏబిఎన్ ఛానెల్ పెట్టుకుని చూడండి, సబ్జెక్ట్ అంతా తెలుస్తుంది అని చెప్పి ఫోన్ పెట్టేసాడు. చంద్రబాబు వెంటనే టి.వి ఆన్‌చేసి ఏబిఎన్ ఛానెల్ పెట్టాడు. "రాష్ట్రంలో చెంపదెబ్బల బాబా" అనే హెడ్డింగ్‌తో ఒక స్టోరీ రన్‌అవుతుంది. బాలకృష్ణ చేతిలో చెంపదెబ్బలు తినడానికి అభిమానుల తాకిడి, చెంపదెబ్బల కోసం పైరవీలు చేస్తున్న నాయకులు, సీఎం స్థాయిలో ఒత్తిడి తెచ్చయినా బాలయ్య చేత ఒక్క చెంపదెబ్బయినా కొట్టించు కోవాలని పరితపిస్తున్న మంత్రులు... బాలకృష్ణ చేతిలో చెంపదెబ్బ తిన్నవారికి సకల భోగభాగ్యాలు సమకూరుతాయని, కోరిన కోరికలు నెరవేరుతాయని నమ్ముతున్న జనం... అని యాంకర్ చెబుతోంది. ఆ ఛానెల్ స్క్రీన్‌పై నంద్యాలలో బాలకృష్ణ బసచేసిన ప్రాంతాన్ని చూపిస్తున్నారు. బాలకృష్ణ చుట్టూ మంత్రులు, ఎమ్మెల్యేలు చేరిపోయారు. ఒక్క చెంపదెబ్బయినా కొట్టమని ప్రాధేయపడుతున్నారు. అప్పుడే బ్యాక్‌గ్రౌండ్‌లో... బాలకృష్ణ ఓ అభిమానిని చెంపదెబ్బ కొట్టే సీన్ చూపిస్తూ... "అబ్బనీ తియ్యనీ దెబ్బ... ఎంత కమ్మగా ఉందిరో యబ్బా" అనే పాట పెట్టారు. మళ్లీ అక్కడే యాంకర్ దివ్యస్వప్న ఎంపి టి.జి.వెంకటేష్‌తో ఇంటర్వ్యూ చేస్తూ... బాలకృష్ణ చెంప దెబ్బల సీన్‌కు ఇంత రియాక్షన్ ఎందుకు వచ్చిందని ప్రశ్నించింది. దానికి టీజి వెంకటేష్... మొదట్లో బాలకృష్ణ కోపంతో, అసహనంతో అభిమానులను కొడుతున్నారని అందరూ పొరపడ్డారు. కాని, ఆయన ఎవరి మీద ప్రేముంటే వారినే చెంపదెబ్బ కొడుతున్నారు. అలా చెంపదెబ్బలుతిన్న వాళ్ల భవిష్యత్ దివ్యంగా ఉంటుంది. మన చెంపను ఆ మహానుభావుడి చేయి తాకాలన్నా అదృష్టం వుండాలి. బాలయ్య చెంపదెబ్బల యాక్షన్‌కు అదృష్టం కలిసివస్తుండడం వల్లే రియాక్షన్ ఇంతలా వుందని చెప్పాడు. తర్వాత యాంకర్ దివ్యస్వప్న అక్కడేవున్న ఫరూఖ్‌తో... బాలయ్య గారి చెంపదెబ్బలపై మీ స్పందనేంటని అడిగింది. అందుకాయన... బాలయ్య గారు ముందు చెంపదెబ్బల విషయంలో స్థానికులకు ప్రాధాన్యతనివ్వాలి. ఆ తర్వాతే బయట ప్రాంతాల వారిని పట్టించుకోవాలి. మమ్మల్ని తక్కువ చేసి చూస్తే ఎన్నికలనే బాయ్‌కాట్ చేస్తామని వార్నింగ్ ఇచ్చాడు. వీళ్లతో ఇంటర్వ్యూలు ముగిసాక యాంకర్ దివ్యస్వప్న లైన్‌లో... చూసారు కదా, బాలయ్య బాబాగారి చెంపదెబ్బలకు వస్తున్న రియాక్షన్‌ను... తెలుగుదేశం పార్టీకి బాలయ్య ఇప్పుడు మంచి ఎసెట్ కాబోతున్నారు. తెలుగుదేశానికి ఓటేసిన వాళ్లకే బాలయ్య చెంపదెబ్బ ఛాన్స్ అని వచ్చే ఎన్నికల్లో ఓటర్లకు ఆఫర్ పెడితే తిరిగి అధికారం తెలుగుదేశందే... ఇట్లు కెమెరామెన్ డూప్‌బాబుతో దివ్యస్వప్న... అని ముగించింది. చంద్రబాబు టీవీలో అంతా చూసాడు. అసలేం జరిగిందో అతనికి అర్థం కాలేదు. వెంటనే ఏబిఎన్ ఛానెల్ అధినేత గోపాలకృష్ణకు ఫోన్ చేసి ఇంటికి రమ్మన్నాడు. అరగంటకల్లా గోపాలకృష్ణ చంద్రబాబు ఇంట్లో ప్రత్యక్షమయ్యాడు. బాలకృష్ణ చెంపదెబ్బల సీన్ ఏంటి... మనం రివర్స్ అవుతుందనుకుంటే ఇలా పాజిటివ్‌గా మారింది... దీనికి కారణమేంటని అడిగాడు. అందుకు గోపాలకృష్ణ... ఆ క్రెడిట్ నాదే. బాలయ్యను కొట్టకుండా ఆపలేం... ఆయన కొట్టడం మొదలుపెడితే దబ్బిడిదిబ్బిడే... కాబట్టి ఆయన చెంపదెబ్బల సీన్‌ను పార్టీకి పాజిటివ్‌గా మలచాలనుకున్నా. అందుకే గతంలో బాలయ్య చేతిలో చెంపదెబ్బలు తిన్న వారితో స్పెషల్ ఇంటర్వ్యూలు తీయించాను. చెంపదెబ్బలు తిన్నాక వాళ్ల బ్రతుకులు మారినట్లు, గుడిసెల నుండి వారి బ్రతుకులు బంగళాకు మారినట్లు ఛానెల్‌లో చూపించాము... బాలయ్య చేతిలో చెంపదెబ్బలు తిన్నాకే కొందరికి ఎంపి పదవులు, మంత్రిపదవులు వచ్చినట్లు కూడా మా ఛానల్‌లో చెప్పించాం, దాంతో జనం బాలయ్య ఎక్కడ కొడతాడో అనే స్టేజి నుంచి ఆయన చేత ఎప్పుడు కొట్టించుకుందామా అనే స్టేజికి వచ్చారు. ఇప్పుడు బాలయ్య చెంపదెబ్బలు కొట్టినా మన పార్టీకి మైలేజీ పెరుగుతుందేగాని, తగ్గదని చెప్పాడు. అది విన్న చంద్రబాబు తనకు ఇంతగా ఉపయోగపడుతున్న గోపాలకృష్ణ వైపు కృతజ్ఞతగా చూసాడు.

## మేషం



అశ్విని, భరణి, కృతిక 1 పాదము

శుభకార్య ప్రయత్నాలలో పాల్గొంటారు. ఉద్యోగార్థులకు అవకాశాలు కలసివస్తాయి. కొత్త వసతులు సమకూర్చుకొంటారు. రాజకీయ వర్గాలకు ఇబ్బందికర దినాలివి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకొనండి. వృత్తి వ్యాపారాలలో ఇబ్బందులు తొలగి రాబడి పెరుగుతుంది. అవసరాలు ఏదో ఒక విధంగా నెరవేరగలవు. అయితే ఆర్థికస్తబ్దత ఉంటుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

ఉద్యోగులకు బాగా శ్రమ, పని భారం ఉంటుంది. ఉద్యోగావకాశాలు లభించగలవు. కుటుంబ సౌఖ్యం, విద్యా ప్రగతి బాగుంటుంది. వస్తు వాహన రిపేర్లుండగలవు. శుభకార్య ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తారు. ఆరోగ్యం ఫరవాలేదు. ఖర్చులు బాగా పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. పలుకుబడి బాగుండి అనుకున్న పనులు జరిగిపోతాయి.

## మిధునం



మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

దూరప్రయాణాలు, సామాజిక సేవా కార్యక్రమాలకు వెళతారు. ఉద్యోగులు అధికారులతో, పబ్లిక్‌తో జాగ్రత్తగా ఉండాలి. యజమానులు వర్కర్లతో జాగ్రత్త పడండి. విద్యాప్రగతి బాగుంటుంది. రాజకీయ వర్గాల వారు విమర్శలు ఎదుర్కొనవలసి ఉంటుంది. అనుకున్న పనులకు ఆటంకాలు తొలగి సవ్యంగా జరుగుతాయి. వ్యాపారాలు అభివృద్ధి చెంది, ఆదాయం పెరుగుతుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్యమి, ఆశ్లేష

దూరప్రయాణాలుంటాయి. కొత్త కాంట్రాక్టులు లీజులు లభించగలవు. విద్యాప్రగతి బాగుంటుంది. ఇతరుల పనులు చేయబోయి ఇబ్బందుల్లో పడతారు. కోర్టు వ్యవహారాలు, రావలసిన బాకీలు వాయిదా పడతాయి. ఆర్థిక ఇబ్బందులుంటాయి. వృత్తి వ్యాపారాలు నిరుత్సాహం కలిగిస్తాయి. పంతాలు, పట్టుదలకు పోకుండా పనులు జరుపుకోవాలి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

కొత్త పరిచయాలు, వ్యాపకాలు పెరుగుతాయి. ఋణాలివ్వడం, హామీలివ్వడం చేయవద్దు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. పనులు నిదానంగా జరుగుతూ టెన్షన్ కలిగిస్తాయి. ఆరోగ్యం సరిగా ఉండదు. అనవసర విషయాలు, కుటుంబ వ్యక్తుల పనులు ఆందోళన కలిగిస్తాయి. ఆదాయ ఖర్చులు సమతుల్యంగా ఉంటాయి. వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం పెరుగుతుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు దొరుకుతాయి. షేర్లు, స్థిరాస్తుల మీద ఆదాయం ఉంటుంది. కుటుంబ సౌఖ్యం, ఆరోగ్య పరిస్థితి బాగుంటుంది. ఉద్యోగులకు పనిభారం అధికారుల ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. ముఖ్య ఆర్థిక లావాదేవీలు వాయిదా పడతాయి. చేపట్టిన పనులు అయినవి అనిపిస్తారు. వ్యాపారాలు ప్రోత్సాహకరంగా జరుగుతాయి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

### రాశి - మీ వాసి

తేది. 25.8.2017 నుండి

తేది. 31.8.2017 వరకు

ఈ వారము కర్కాటక రాశిలో శుక్ర రాహు కుజులు, 27తేది నుండి సింహంలో కుజుడు, సింహంలో రవి బుధులు, కన్యలో గురువు, వృశ్చికంలో శని, మకరంలో కేతువు, కన్య, తుల, వృశ్చిక, ధనుఃరాశులలో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగము

తేది 25 శుక్రవారము వినాయక చతుర్థి పర్వదినము

భాద్రపద మాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 25 | శుక్ర | చతుర్థి | రా॥ గం.10.53వ॥ |
| తేది. 26 | శని | పంచమి | రా॥ గం.9.36వ॥ |
| తేది. 27 | ఆది | షష్ఠి | రా॥ గం.8.00వ॥ |
| తేది. 28 | సోమ | సప్తమి | సా॥ గం.6.02వ॥ |
| తేది. 29 | మంగళ | అష్టమి | సా॥ గం. 3.58వ॥ |
| తేది. 30 | బుధ | నవమి | ప॥ గం.1.30వ॥ |
| తేది. 31 | గురు | దశమి | ప॥ గం.11.03వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. కోర్టు కేసులు, రావలసిన బాకీలు వాయిదా పడతాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు లభించగలవు. విలువైన వస్తువులు, పత్రాలు జాగ్రత్త. తొందరపడి అతిగా విశ్వసించి ఇబ్బందులు పడతారు. విద్యాకృషి అవసరం. ఖర్చుల తాకిడి పెరుగుతుంది. కుటుంబసభ్యుల పనుల వల్ల ఇబ్బందులు పడతారు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

సామాజిక సేవ, సమావేశాలలో పాల్గొంటారు. ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేని పరిస్థితులుంటాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ఉద్యోగ ప్రయత్నాలలో ఇంటర్వ్యూ అవకాశాలు, అనుకోని దూర ప్రయాణాలు, కోర్టు వ్యవహారాలు వాయిదా పడడం ఉంటుంది. వ్యవహారాలు ఇంటా బయట స్వయంగా పర్యవేక్షించండి. శుభకార్యాలు నిర్ణయం కాగలవు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

కుటుంబ సభ్యుల సహకారం, కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ఉద్యోగులు తమ అధికారులతోను, పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. సమస్యలను రాజీ మార్గంలో పరిష్కరించుకొంటే మంచిది. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. కొత్త కాంట్రాక్టులు, లీజులకు అనుకూలత బాగుంది. ఆర్థిక ఇబ్బందులుండినా డబ్బులు సర్దుబాటు కాగలవు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

గృహనిర్మాణ దారులు, కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడతారు. ఉద్యోగులకు పనిభారం, వత్తిడి ఎక్కువగా ఉంటుంది. విద్యాప్రగతి బాగుంటుంది. వస్తు వాహన రిపేర్లుంటాయి. ఆరోగ్యం జాగ్రత్త. కార్యనిర్వహణ సామర్థ్యం బాగుండినా జరుపదలచిన పనులకు ఆటంకాలుండగలవు. అందుచే కోపం టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. ఆర్థిక ఇబ్బందులుంటాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

అనుకున్న పనులు టెన్షన్‌తో జరుగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంది. పెట్టుబడులు, వాణిజ్య విస్తరణకు అవకాశాలు దొరకడం ఉంటుంది. విలువైన వస్తువులు, పత్రాలు జాగ్రత్త. ఆర్థికంగా పరిస్థితులు సంతృప్తికరం. స్థిరాస్తులు, షేర్ల మీద ఆదాయం ఉంటుంది. కొత్త పరిచయాలు బలపడి, పలుకుబడి పెరుగుతుంది. శుభకార్యాలు నిర్ణయం కాగలవు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఆరోగ్యం బాగుంటుంది. ఉద్యోగావకాశాలు లభించగలవు. శుభవార్తలు వింటారు. ఉద్యోగులకు కార్య సామర్థ్యం, అధికారుల ఆదరణ బాగుంటుంది. విద్యా ప్రగతి బాగుంటుంది. అనుకున్న పనులు సవ్యంగా జరుగుతాయి. బంధుమిత్రులను కలుసుకొంటారు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో మంచి అభివృద్ధి, రాబడి ఉంటుంది.

# కళ్యాణ వైభవం...!



ఇందుకూరుపేట మండలం గంగపట్నం వాస్తవ్యులు కొండూరు చంద్రకుమార్‌రెడ్డి(హరి) - సురేఖల కుమార్తె **స్వాతి నిషిత - శశాంక్‌రెడ్డి** (చెన్నైలోని స్పిక్ లిమిటెడ్ మార్కెటింగ్ జిఎం సైకం రఘునాథరెడ్డి - పద్మలతల కుమారుడు)ల కళ్యాణం ఈ నెల 17వ తేదీ నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ నందు జరిగింది. కొత్త దంపతులకు 'లాయర్' శుభదీవెనలు.



నెల్లూరులోని ప్రముఖ సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్, అభిలయ ఆర్థోపెడిక్ హాస్పిటల్ అధినేత డా॥ ఉమామహేశ్వరరెడ్డి - డా॥ మహేశ్వరిల కుమారుడు **అభినయ్ - పూజిత**ల వివాహం ఈ నెల 12వ తేదీ నెల్లూరు అనిల్ గార్డెన్స్‌లో జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

## గూడూరు బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో

# ప్రకాశం పంతులు జయంతి




గూడూరు బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య గూడూరు శాఖ ఆధ్వర్యంలో హనుమంతరావు నగర్‌లో బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడు యరగుడిపాటి చలపతి రావు నివాసంలో ఈ నెల 23వ తేదీ ఆంధ్రప్రదేశ్ మొదటి ముఖ్య మంత్రి టంగుటూరు ప్రకాశం పంతులు 146వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయనకు బ్రాహ్మణ సంఘం తరపున నివాళులర్పించారు. అధ్యక్షుడు యరగుడిపాటి చలపతిరావు, ఉపాధ్యక్షుడు ఆనిమెళ్ళ శివకుమార్ మాట్లాడుతూ ఆయన పేద కుటుంబం నుండి ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ న్యాయవాది వృత్తిని చేపట్టి స్వాతంత్ర్య సమరంలో పాలు పంచుకుని, సైమన్ కమిషన్‌కు ఎదురొడ్డి కాల్చుమని నిర్భయంగా నిలబడిన వ్యక్తి అని, ఆయన హయాంలో అవినీతికి తావులేదని కీర్తించారు. ఆయన ఎందరికో మార్గదర్శకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జి.కె. నాథబ్రహ్మం, కార్యదర్శి సి. హెచ్.శ్రీనివాసరావు, ట్రెజరర్ శ్రావణ్‌కుమార్, బి.శ్రీనివాసులు, కె.రామమూర్తి, కుమార్, కోట బాలసుందరశర్మ, సురేష్, జి.శ్రీనివాసకుమార్, ఎ.శివకుమార్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

# సిక్కా క్లబ్‌హౌస్ బ్రోచర్ ఆవిష్కరణ



నెల్లూరు ఇస్కాన్‌సిటిలోని సిక్కా కార్యాలయంలో బుధవారం సాయంత్రం సిక్కా క్లబ్‌హౌస్ బ్రోచర్‌ను ప్రముఖ సినీనటి కవిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ మంచి ఉద్దేశ్యంతో పిఎస్ రెడ్డి సౌత్ ఇండియన్ సినీ కల్చరల్ అసోసియేషన్‌ను స్థాపించడం హర్షించదగ్గ విషయమన్నారు. నెల్లూరులో నిర్మితమవుతున్న ఫిలిం డెవలప్‌మెంట్‌కు తాను పూర్తిగా సహకరిస్తానన్నారు. సిక్కా అధ్యక్షులు పిఎస్ రెడ్డి మాట్లాడుతూ సిక్కా క్లబ్‌హౌస్‌ను పూర్తిస్థాయిలో సెప్టెంబర్ 2వ తేదీ సాయంత్రం 6గంటలకు 45మంది సినీ ప్రముఖులు, నగర ప్రముఖుల సమక్షంలో ప్రారంభిస్తామన్నారు. ఈ సందర్భంగా తన సొంత బ్యానర్‌లో రెండు చిత్రాలను ప్రారంభిస్తామని, ఒక చిత్రానికి పిసిరెడ్డి, మరొక చిత్రానికి కంకణాల శ్రీనివాసరెడ్డి దర్శకత్వం వహిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో సిక్కా ఉపాధ్యక్షులు సూర్యనారాయణరెడ్డి, మెంబరు డి.వెంకట్రావు, టెక్నికల్ డైరెక్టర్ కొణికా రమణయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# భక్తజన సంద్రంగా.. గొలగమూడి

## ముగిసిన వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు



గొలగమూడిలోని భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారి 35వ ఆరాధనోత్సవాలు ఈ నెల 24వ తేదీతో ముగిశాయి. స్వామివారి ఆరాధనోత్సవాలకు వెల్లువగా తరలివచ్చిన భక్తులతో గొలగమూడి భక్తజనసంద్రంగా మారింది. 'ఓం నారాయణ-ఆదినారాయణ' మంత్రజపంతో, భగవాన్ వెంకయ్యస్వామి నామస్మరణలతో గొలగమూడి ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. ఈ నెల 18 నుంచి స్వామివారి ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ వారం రోజుల పాటు ఎంతో వైభవంగా స్వామివారి వాహనోత్సవాలు జరిగాయి. సర్వభూపాల-కల్పవృక్ష వాహనసేవలు, హనుమంతసేవ, చంద్రప్రభ వాహనసేవ, చినశేషనవాహన సేవ, హంసవాహన సేవ, సూర్యప్రభ, గజ, అశ్వ వాహనసేవలు, పెదశేష వాహనసేవ, సింహవాహనసేవ, గరుడవాహనసేవలతో పాటు ఈ నెల 24న అంగరంగవైభవంగా జరిగిన రథోత్సవానికి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. 24న సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆ రాత్రి ఎంతో నేత్రపర్వంగా జరిగిన తెప్ప మహోత్సవానికి భక్తజనం పోటెత్తారు. ఎక్కడ చూసినా కనుచూపుమేరా భక్తజనంతో గొలగమూడి కిటకిటలాడింది. జిల్లానుంచే కాక, రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాల నుంచి స్వామివారి ఆరాధనకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి వాహనోత్సవాలు, భక్తుల భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఆరాధనోత్సవాలు కన్నులపండువుగా జరిగాయి.

అసంఖ్యాకంగా తరలివచ్చిన భక్తజనసందోహానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆశ్రమ కార్యనిర్వహణాధికారి పి.బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. స్వామివారి దర్శనంతో పాటు, భక్తులకు వసతి తదితర ప్రాథమిక సౌకర్యాలను కల్పించారు. ఈ సందర్భంగా గొలగమూడి వెంకయ్యస్వామి ఆలయాన్ని ఆశ్రమ నిర్వాహకులు విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు.



## కావలి కబుర్లు

# ఏరియా ఆసుపత్రి అభివృద్ధే ధ్యేయం

**- కందుకూరి**



కావలి ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి బిజెపి కట్టుబడి ఉందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ప్రకాశం జిల్లా ఇన్‌ఛార్జి కందుకూరి వెంకటసత్యనారాయణ అన్నారు. ఈ ఆసుపత్రి అభివృద్ధికి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ తనవంతు సహకారం అందిస్తున్నారని, ఇందులో భాగంగా రాష్ట్ర మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఛైర్మెన్ ఆర్.లక్ష్మీపతి సోమవారం ఈ ఆసుపత్రిని సందర్శించారని ఆయన పేర్కొన్నారు. గతంలో ఆసుపత్రులు శుభ్రత లేకుండా రోగులు ప్రభుత్వాసుపత్రులకు రావాలంటేనే భయపడేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి పోయిందని ఈ సందర్భంగా లక్ష్మీపతి పేర్కొన్నారు. ప్రభుత్వాసుపత్రులు కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా పనిచేస్తున్నాయన్నారు. కావలి ఆసుపత్రిలో పారిశుద్ధ్య పరిస్థితి బావుందన్నారు. కావలి ఆసుపత్రిలో ముఖ్యంగా మంచినీటి సౌకర్యం, డయాలసిస్, కొత్తగా ఓ.పి బ్లాక్, అధునాతన వైద్యపరికరాలు కావాలని ఆసుపత్రి సూపరింటెండెంట్, అభివృద్ధి కమిటీవారు తనకు వినతిపత్రం అందించారని ఆయన తెలిపారు. త్వరలోనే ఆర్.ఓ ప్లాంట్‌ను కందుకూరి వెంకటసత్యనారాయణ సహకారంతో ప్రారంభించేందుకు వస్తామని, ఆసుపత్రిలో డయాలసిస్ సౌకర్యం ఏర్పాటుకు కృషి చేస్తామని లక్ష్మీపతి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ సుబ్బారావు, ఆర్ఎంఓ, కమిటీ ఛైర్మెన్ గుత్తికొండ కిషోర్‌బాబు, డైరెక్టర్లు పాదర్తి నాగరాజు, ద్రోణాదుల వెంకట్రావు, బిజెపి నాయకులు, కావలి ఏఎంసి డైరెక్టర్ సన్నికంటి శీనయ్య, పత్తిపాటి వరలక్ష్మమ్మ, మస్తాన్‌వలి, పాతపాటి రమణారెడ్డి, సంఘమేశ్వరరావు పాల్గొన్నారు.

# ఆర్డీఓకు స్వచ్ఛంద సంస్థల ఘనసన్మానం



కావలి ఆర్డీఓ ఇస్కా భక్తవత్సలరెడ్డి స్వాతంత్ర్యదినోత్సవ పురస్కారం అందుకున్న సందర్భంగా కావలిలోని వివిధ స్వచ్ఛంద సంస్థలు ఆర్డీఓను ఘనంగా సత్కరించాయి. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్‌విడిఎస్, జైభీమ్, రెడ్‌క్రాస్ రక్తనిధి సిబ్బంది ఆర్డీఓను కలసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జైభీమ్ సంస్థ ప్రతినిధి, కలిగిరి పంచాయతీరాజ్ ఏ.ఇ చెన్నకేశవులు మాట్లాడుతూ, తక్కువ వ్యవధిలో ఎక్కువ సమస్యలు పరిష్కరించి జిల్లా ఉన్నతాధికారుల మన్ననలు పొందిన ఆర్డీఓ సేవలు ఎంతైనా అభినందనీయమన్నారు. రెడ్‌క్రాస్‌ను సంస్థాగతంగా బలోపేతం చేయడంతో పాటు, డివిజన్ మొత్తం విస్తరింపజేశారని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆ కార్యాలయంలో పనిచేస్తున్న చిరుద్యోగి రామారావు కూడా అవార్డు పొందిన సందర్భంగా ఆయన్ను కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు గంధం ప్రసన్నాంజనేయులు, డి.రవిప్రకాష్, రక్తనిధి సిబ్బంది బిఎస్ ప్రసాద్, ఐ.రాజశేఖర్, కెవి పద్మావతి, హరీష్, రమాదేవి, జైభీమ్ సంస్థ ప్రతినిధులు డి.బాలకృష్ణ, మాజీ జడ్పీటిసి కందుల శ్రీనివాసులు, ఆర్‌విడిఎస్ వ్యవస్థాపకులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# బెట్టింగ్ ఊబిలో సిట్టింగ్‌లు

(మొదటి పేజీ తరువాయి)

విచారణకు హాజరు కావాలని ఆదేశించడంతో ఈ కేసుకు రాజకీయ ప్రాధాన్యత ఏర్పడింది. నిష్పక్షపాతంగా జరుగుతున్న బెట్టింగ్ కేసు దర్యాప్తులో అధికారపార్టీ ఒత్తిళ్లు కనిపిస్తున్నాయని ప్రతిపక్షం ఆరోపిస్తోంది.

నెల్లూరు, స్టోన్‌హౌస్‌పేట ప్రాంతంలో ఓ పేకాట కేంద్రంపై జరిగిన దాడితో బెట్టింగ్ మాఫియా తీగ కదిలింది. నెల్లూరులో బెట్టింగ్ మాఫియా పరపతి, పలుకుబడి గురించి ఎస్పీకి అప్పుడే తెలిసింది. దాంతో ఆయన మొదట ప్రధాన బుకీ కృష్ణసింగ్‌కే గురిపెట్టి అదుపులోకి తీసుకున్నాడు. తమదైన శైలిలో విచారించడం ద్వారా అతని నుండి రాబట్టాల్సిన సమాచారాన్నంతా కూడా రాబట్టాడు. అతనిచ్చిన సమాచారంతోనే 116మంది బుకీలను, పంటర్లను అరెస్ట్ చేయడమే కాకుండా, బెట్టింగ్ రాయుళ్లకు సహకరించారన్న కారణంతో ఇద్దరు డిఎస్పీలు, ఇద్దరి సిఐల మీద చర్యలు తీసుకోవడం తెలిసిందే! బెట్టింగ్ భాగోతంలో పలువురు టిడిపి, వైసిపి నాయకులను అరెస్ట్ చేయడం కూడా జరిగింది.

ఇదంతా ఒకెత్తయితే ఈమధ్య బుకీ కృష్ణసింగ్ నుండి వైసిపి ఎమ్మెల్యేలకు 40లక్షలు అందాయని ఓ దినపత్రికలో వార్త రావడం, ఆ వార్త తనను అనుమానించేదిగా ఉండడంతో నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎస్పీ కార్యాలయానికి వెళ్లి 40లక్షలు తీసుకున్న ఆ ఎమ్మెల్యే పేరు వెల్లడించాలంటూ ఎస్పీ రామకృష్ణను కోరడం తెలిసిందే! ఎస్పీ రామకృష్ణ కూడా తమ విచారణలో ఎమ్మెల్యే పేర్లు రాలేదని వివరించారు. ఈ కేసు పట్టుబడ్డ బుకీలు, పంటర్ల వరకే పరిమితమవుతుందనుకున్న తరుణంలో అకస్మాత్తుగా కీలకమలుపు తిరిగింది. బెట్టింగ్ కేసుకు సంబంధించి విచారణకు హాజరు కావాలంటూ నంద్యాల ప్రచారంలో వున్న ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్ కుమార్‌లకు పోలీసులు స్వయంగా నోటీసులు అందించి వచ్చారు. దీని ప్రకారమే ఎమ్మెల్యేలిద్దరూ 22వ తేదీ జిల్లా పోలీసు కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. క్రికెట్ బుకీ కృష్ణసింగ్‌తోనూ, ఫైనాన్షియర్ ఎల్ఎస్ఆర్(లేబూరు శ్రీధర్ రెడ్డి)తోనూ వున్న సంబంధాలపైనే వీరిని ప్రధానంగా విచారించినట్లు తెలుస్తోంది. ఏఎస్పీ శరత్‌బాబు, మరో ఇద్దరు డిఎస్పీలు విచారణలో పాల్గొన్నారు. కృష్ణసింగ్‌తో ఒకటిన్నర గంట పాటు ఫోన్‌లో మాట్లాడారు కదా అని పోలీసులు అడిగినప్పుడు కోటంరెడ్డి... కృష్ణసింగ్‌తో మూడు, నాలుగు సార్లకు మించి మాట్లాడి వుండనని, అది కూడా తన పుట్టినరోజు నాడు విష్ చేయడానికి, నేను టీవీ లైవ్‌షోలో మాట్లాడినప్పుడు బాగా మాట్లాడావని అభినందించడానికి మాత్రమే చేసుంటాడని, అది కూడా పది నుండి పద్దెనిమిది సెకండ్ల లోపు కాల్ మాత్రమే ఉంటుందని సమాధానం చెప్పారు. అప్పుడే పోలీసులు కోటంరెడ్డి కాల్‌డేటాను పరిశీలిస్తే... అతను చెప్పినట్లే కృష్ణసింగ్‌తో మాట్లాడిన కాల్స్ పన్నెండు, పద్దెనిమిది సెకండ్లు మాత్రమే వున్నాయని తెలిసింది. 2014లో మేయర్‌గా అజీజ్ ఎన్నిక కోసం సిటి ఎమ్మెల్యే అనిల్, మీరు గోవాలో పెట్టిన కార్పొరేటర్ల క్యాంప్‌కు కూడా కృష్ణసింగ్ ఖర్చు పెట్టాడంట కదా అన్న పోలీసుల ప్రశ్నకు కోటంరెడ్డి క్లారిటీగానే సమాధానం ఇచ్చాడని తెలిసింది. ఆ క్యాంప్ ఖర్చులన్నీ అబ్దుల్ అజీజే భరించాడని, అజీజ్ వ్యాపారవేత్త కాబట్టి అతనికి కృష్ణసింగ్ వద్ద డబ్బు తీసుకోవాల్సిన అవసరముండి ఉండదని చెప్పారు. కృష్ణసింగ్ అకౌంట్ నుండి మీ అకౌంట్‌కు డబ్బులు వచ్చాయా? అని పోలీసులు వేసిన ప్రశ్నకు కోటంరెడ్డి స్పష్టంగానే... అతని ఖాతా నుండి నాకు ఎలాంటి డబ్బు రాలేదు. ఎవరి వద్ద నుండి కూడా నేను ముడుపులు తీసుకోలేదు. కావాలంటే నా అకౌంట్‌నే కాకుండా నా కుటుంబసభ్యుల అకౌంట్లను కూడా పరిశీలించుకోవచ్చని ఆయన చెప్పాడు. ఎల్ఎస్ఆర్‌తో సంబంధాలపై పోలీసులు ఆరా తీయగా... తనకు ఎల్ఎస్ఆర్ చిన్నప్పటి నుండి స్నేహితుడని, అప్పుడప్పుడు అతనితో ఫోన్‌లో మాట్లాడడమే కాకుండా తరచూ అతని ఆఫీసుకు వెళుతుంటానని సమాధానమిచ్చాడు. ఎల్ఎస్ఆర్ ఆఫీసుకు ఇంకా ఎవరెవరు వస్తుంటారని పోలీసులు ఆరా తీయగా మాజీఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, విజయ డెయిరి ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు, వై.వి.రామిరెడ్డిలు కూడా వస్తుంటారని కోటంరెడ్డి చెప్పాడని సమాచారం. కోటంరెడ్డి తర్వాత అనిల్‌ను విచారించారు. కృష్ణసింగ్‌తో పాటు ఇతర బుకీలతో మీకు సంబంధాలున్నాయా?అనే దానిమీదే అనిల్‌ను విచారించారు. కృష్ణసింగ్ కాదు, ఎవ్వరివద్దా తాను రూపాయి తీసుకోలేదని, రాజకీయాల్లోకి వచ్చాక 30కోట్ల రూపాయల ఆస్తులమ్ముకున్నానని అనిల్ సమాధానమిచ్చాడు. ఎమ్మెల్యేలిద్దరిని కూడా కృష్ణసింగ్ నుండి మీరు ఆర్థికంగా ప్రయోజనం పొందారా? అనే దృష్టితోనే పోలీసు విచారణ జరిగినట్లు తెలుస్తోంది.

మొదట వైకాపా ఎమ్మెల్యేలను మాత్రమే విచారణకు పిలవడంతో ఈ కేసు రాజకీయరంగు పులుముకుంది. క్రికెట్ బుకీలకు వైసిపి నాయకులతో పాటు తెలుగుదేశం నాయకులతో కూడా సంబంధాలున్నాయని తెలుస్తోంది. ఈ కేసును రాజకీయ పక్షపాత కోణంలో కాకుండా బెట్టింగ్‌ను అంతమొందించే దిశగా విచారణ సాగిస్తే ఇంకా కొందరు రాజకీయ నాయకులు తెరమీదకు రావచ్చు.

మొత్తానికి బెట్టింగ్ కేసు కీలక మలుపులు తిరుగుతోంది. కేవలం వైసిపి ఎమ్మెల్యేల విచారణకే దీనిని పరిమితం చేస్తే అధికారపార్టీ ఒత్తిళ్లు పనిచేసాయనే అపప్రద పోలీసులకు వస్తుంది. కేసుతో సంబంధం వున్న అందరినీ విచారిస్తే బెట్టింగ్‌ను అంతం చేయాలన్న ఎస్పీ రామకృష్ణ ఆలోచనకు సార్థకత చేకూరుతుంది.

# కమలంకు పరాభవం

(మొదటి పేజీ తరువాయి)

మరి కాకినాడ కార్పొరేషన్ ఎలక్షన్‌కు వచ్చేసరికి... ఇక్కడ తెలుగుదేసం జెండాలతో సమానంగా బీజేపీ జెండాలు కనిపిస్తున్నాయి. టీడీపీ కార్యకర్తలతో సమానంగా బీజేపీ కార్యకర్తలు తిరుగుతున్నారు. నగరంలో కమలం చిహ్నాలు సైకిల్‌తో సమానంగా కనిపిస్తున్నాయి. మరి మిత్రపక్షమైన బీజేపీ విషయంలో తెలుగుదేశం వాళ్ళు నంద్యాలలో ఒక న్యాయం, కాకినాడలో ఒక న్యాయం ఎందుకు పాటించినట్లు? ఎందుకంటే నంద్యాలలో ముస్లింల ఓట్లు ఎక్కువ. పార్టీల గెలుపోటములను ప్రభావితం చేసేది కూడా ముస్లింల ఓట్లే! బీజేపీ జెండాలు కనిపిస్తే ముస్లింల ఓట్లు పోతాయేమోనన్న భయంతోనే నంద్యాలలో వాళ్లను జెండాలు పట్టుకోవద్దన్నారు. అదే కాకినాడలో అయితే ముస్లిం ఓట్ల ప్రభావం తక్కువ. అందుకే అక్కడ జెండాలు కనిపించినా ఫర్వాలేదన్నారు. పొత్తు కూడా కుదుర్చు కున్నారు. నంద్యాలలో మీ జెండాలు కనపడనీయొద్దని చంద్రబాబు అంటే సిగ్గు, అభిమానం వున్న మిత్రపక్ష నాయకులెవరైనా... మీరూ వద్దు, మీ పొత్తూ వద్దు అని తెగదెంపులు చేసుకుంటారు. ప్రచారానికి దూరంగా వుండిపోతారు. కాని, ఏపి బీజేపీలో సొంత పార్టీ మీద కంటే కూడా చంద్రబాబు పట్ల భక్తి, విశ్వాసం చూపించే నాయకులు ఎక్కువుగా వున్నారు. వీళ్లు బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా ఆదేశాల కంటే కూడా చంద్రబాబు ఆదేశాలనే పాటిస్తుంటారు. తమను అందలం ఎక్కించిన బీజేపీ ఏమైపోయినా ఫర్వాలేదు, చంద్రబాబు బాగుంటే చాలు అనుకుంటారు. అందుకే సిగ్గూశరం లేకుండా తమ పార్టీ జెండాలను కనిపించనీయొద్దని చంద్రబాబు చెప్పిన మాటకు తలాడించి అలాగే చేశారు. తమ పార్టీనే చిన్నబుచ్చారు. బీజేపీలో వున్న ఇలాంటి టీడీపీ ఏజంట్ల వల్లే ఈ రాష్ట్రంలో బీజేపీకి ఎదుగూ బొదుగూ లేకుండాపోయింది.




ఉత్తరక్రియలు

నెల్లూరుజిల్లా చిన్నచెరుకూరు వాస్తవ్యులు

మాగుంట దశరథరామిరెడ్డి గారు

తేది 20.08.2017 ఆదివారం పరమపదించినారు.

వారి ఆత్మ శాంతికై ప్రార్థిస్తూ...

కుమారుడు:

మాగుంట సోమశేఖరరెడ్డి

మరియు కుటుంబసభ్యులు

ఉత్తరక్రియలు

పెద్దకర్మ : తేది 30.08.2017 బుధవారం

బెంగుళూరులోని వారి స్వగృహమునందు జరుగును.

బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

# శ్రద్ధాంజలి



మా ఇంటి జ్యోతి, నిరంతరం మా హృదయాలలో వెలిగే ధృవతార, మాకు మార్గదర్శకులు, అనురాగమూర్తి

## కీ॥ శే॥ శ్రీ గునుపాటి సుబ్బరామిరెడ్డి గారు

(కొత్తూరు గ్రామం, ఇందుకూరుపేట మండలం)

పరమపదించి ఆగస్టు 27, 2017 నాటికి 27 సంవత్సరాలు నిండుతాయి
ఆ మహనీయమూర్తిని సంస్మరించుకుంటూ... వారి ఆత్మకు శాంతి చేకూరుటకై ప్రార్థిస్తున్నాము.

అర్ధాంగి: **కీ॥శే॥ గునుపాటి రుక్మిణమ్మ**

కుమారులు - కోడళ్ళు

**గునుపాటి వెంకటకృష్టారెడ్డి - ఇందిరమ్మ**
**గునుపాటి జనార్ధన్‌రెడ్డి - సునీతమ్మ**
**గునుపాటి రామ్‌మోహన్ రెడ్డి - శుభప్రదమ్మ**

కుమార్తెలు - అల్లుళ్ళు

**కోటిరెడ్డి నిర్మలమ్మ - కీ॥ శే॥ కోటిరెడ్డి రామచంద్రారెడ్డి**
**అత్తివరపు విమలమ్మ - అత్తివరపు రామచంద్రారెడ్డి**
**దొడ్ల లలితమ్మ - దొడ్ల పద్మనాభరెడ్డి**

మరియు **మనుమలు, మనుమరాళ్ళు, మునిమనుమలు, మునిమనుమరాళ్ళు**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com